ఆంధ్రజ్యోతి

బాపట్ల

బుధవారం 16 అక్టోబరు 2024

విదేశీ నేస్తాలు వచ్చేశాయ్



- పక్షుల కిలకిలరావాలతో అలరారుతున్న ఉప్పలపాడు
- భారీగా తరలి వచ్చిన విదేశీ అతిథులు..
- నిత్యం సందర్శకులతో కిటకిటలాడుతున్న పక్షుల కేంద్రం

8



- బ్యాక్‌వాకింగ్‌తో ఎంతో మేలు
- అదుపులో కొలెస్ట్రాల్, బీపీ, షుగర్
- రోజుకు 10-30 నిమిషాల నడకతో ఆరోగ్యం

వెనక్కి నడుద్దామా..

ఇన్‌చార్జి మంత్రుల నియామకం

- గుంటూరు జిల్లాకు కందుల దుర్గేష్
- పల్నాడుకు గొట్టిపాటి, బాపట్లకు పార్థసారథి
- రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ
- ఇక జిల్లాల అభివృద్ధి అంశాలపై ఇన్‌చార్జి మంత్రుల సమీక్షలు



గొట్టిపాటి రవికుమార్



బాపట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత ఇన్‌చార్జి మంత్రుల నియామకం జరిగింది. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్షలు.. జిల్లా సమీక్ష మండలి సమా వేశాలు.. ఇన్‌చార్జి మంత్రుల నేతృత్వంలో జరుగుతుం టాయి. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం ఇన్‌చార్జి మంత్రుల నియామకం ఉంటుం దని అందరూ భావించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇన్‌చార్జి మంత్రుల ను నియమించలేదు. ఈ క్రమంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవి ష్కరణ కార్యక్రమాలకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు ప్రతీ జిల్లాకు ప్రత్యేకంగా ప్రొటోకాల్ మంత్రిని నియమించి ఆ కార్యక్రమాన్ని సజావుగా జరిగేలా ప్రభుత్వం చూసింది. ఇప్పుడు ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ మంగళవారం ఇన్‌చార్జి మంత్రుల నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు వెలువరించింది. దీంతో ఇక నుంచి జిల్లా అభివృద్ధికి సంబంధించి అన్ని అంశాలపై ఆయా ఇన్‌చార్జి మంత్రులు సమీక్షించనున్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లా సమీక్ష మండలి సమావేశాల్ని నిర్వహించి ప్రాధాన్య అంశాలపై చర్చించి ప్రభుత్వానికి నివేదించి వాటి పరిష్కారానికి ఇన్‌చార్జి మంత్రులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో డీఆర్సీ మీటింగ్ జరుగు తుంది. ఈ సమావేశం ఆరు నెలల వ్యవధిలో జరగడం అనేది తప్పనిసరి. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఇప్పటికే నాలు గు నెలలు దాటడంతో పాటు ఇన్‌చార్జి మంత్రుల నియామకం కూడా జరగడంతో త్వరలోనే డీఆర్సీ మీటింగ్ జరపడానికి ఆయా జిల్లా యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. జిల్లాలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పాలనాప రమైన వ్యవహారాలను కూడా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షించే వీలుంది. గత ప్రభుత్వంలో డీఆర్సీ సమావేశాలు ఓ దశ, దిశ లేకుండా మొక్కుబడిగా సాగేవి. కూటమి ప్రభుత్వంలో ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో జరిగే డీఆర్సీ సమావేశాలు జిల్లా సమగ్రాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



కందుల దుర్గేష్



- గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కందుల దుర్గేష్ నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వంలో దుర్గేష్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా నిడదవోలు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొంది ఆ తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. దుర్గేష్‌కు ఇన్‌చార్జి మంత్రి పదవి రావడంతో గుంటూరు జిల్లా జనసేన పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.
- పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ నియమితులయ్యారు. బాపట్ల జిల్లా అద్దంకి అసెంబ్లీ నియోజవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ ఇంధనశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి కూటమి ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. త్వరలోనే బాధ్యతలను స్వీకరించనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా : మంత్రి రవికుమార్

పల్నాడు జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సమన్వయంతో పనిచేస్తానన్నారు. టీం వర్క్‌తో జిల్లాను ముందుకు తీసుకువెళతానన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించేందుకు ప్రయత్నిస్తానని గొట్టిపాటి చెప్పారు.



పార్థసారథి



- బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొలుసు పార్థసారథి నియమితులయ్యారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్థసారథి కూటమి ప్రభుత్వంలో గృహనిర్మాణ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో త్వరలో డీఆర్సీ మీటింగ్ జరగనున్నది.

కొనుగోళ్లపై కలవరం

- మార్కెట్‌లో పత్తి ధర పతనం
- మార్కెట్ శాఖ సిద్ధం.. ఊసెత్తని సీసీఐ
- మద్దతు ధర దక్కకపోవడంతో రైతు దిగాలు
- క్వింటాకు రూ.1,500 వరకు ధర తగ్గిన వైనం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల ఇంట సిరులు కురిపించాల్సిన తెల్ల బంగారానికి ఆరంభంలోనే మద్దతు ధర కరువవుతోంది. ధర నేల చూపులు చూస్తుండటంతో రైతుల్లో కలవరం మొదలైంది. సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందా లేదా అన్న సందిగ్ధం రైతుల్లో నెలకొంది. సీసీఐ కేంద్రాలు ఇంకా ఏర్పాటు కాలేదు. మార్కెట్ యార్డులో కేంద్రాల ఏర్పాటు విధానానికి సీసీఐ స్వస్తి పలికింది. అయితే పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసే దిశగా సీసీఐ ఉంది. అయితే వాటికి సంబంధించి కూడా ఇంకా నోటిఫై చేయకపోవడం రైతులకు శరాఘాతంగా మారింది. మార్కెట్ శాఖ పత్తి కొనుగోలుకు సీసీఐకి సహకరించేందుకు సమాయత్తమైనా సీసీఐలో ఇంకా చలనం లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 14 కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రైతులు చేతికి వచ్చిన పత్తిని విక్రయిస్తుండగా ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.6500 నుంచి రూ.6 వేలకు అడుగుతున్నారు. క్వింటాకు కేంద్రం మద్దతు ధర 7,521 ప్రకటించగా మార్కెట్‌లో అంతకుమించి ధర పలుకుతుందని రైతులు ఆశించారు. అయితే రూ.2000 వరకు ధర తగ్గడంతో రైతులు ఉసూరుమంటున్నారు. గతంలో మార్కె ట్ యార్డుల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి సీసీఐ పత్తి కొనుగోలు చేసేది. గత ఏడాది నుంచి ఈ విధానానికి స్వస్తి పలికింది. యార్డుల్లో కేంద్రాలకు బదులు పత్తి మిల్లులోనే కేంద్రాలను నిర్వహిస్తోంది. రైతులు నేరుగా వారి ప్రాంతానికి కేటాయించిన మిల్లుకు పత్తి తీసుకుపోవాలి. ఈ విధానంలో కేంద్రాలు అందుబాటులో లేక పోవడంతో రైతులపై రవాణా భారం పడుతుంది. నరసరావుపేట ప్రాంతంలో రైతులు చిలకలూరిపేట జిన్నింగ్ మిల్లుకు తీసుకుపోవాల్సి వస్తుంది.

రోజురోజుకు ధరలు పతనం..

పత్తి ధరలు బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు పతనమవుతున్నాయి. సీసీఐ కేంద్రాలను త్వరతగతిన ఏర్పాటు చేస్తేనే ధర నిలకడగా ఉంటుంది. అయితే ఇంతవరకు సీసీఐ నుంచి చలనం లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు మాయాజాలానికి తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్టై ధరలను తగ్గించేశారు. పత్తి చేతికి వచ్చే సమయంలో ధరలు దిగజారుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల్లోనే క్వింటాకు రూ.1500 నుంచి రూ.2000 వరకు పడిపోయింది.

రైతుల ఆశలు ఆవిరి..


ఆగస్టు వరకు ధరలు మార్కెట్‌లో స్థిరంగా ఉన్నాయి. మార్కెట్‌లో పత్తికి మంచి ధర ఉండటంతో రైతులు ఆ ధరలను చూసి ఖరీఫ్‌లో పత్తి సాగు చేశారు. వేసవిలోనే పల్నాడు ప్రాంతంలో బోరు బావుల కింద ముందస్తుగా సాగు చేసిన పత్తి చేతికి వచ్చింది. దిగుబడులు ఆరంభం కావడంతో ఒక్కసారిగా ధరలు పతనమయ్యాయి. రికార్డు స్థాయి ధరలను చూసి సాగు చేసిన రైతులు నిరాశకు గురయ్యారు. పత్తి చేతి కొచ్చే సమయంలో ధర పడిపోతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రూ.8 వేల నుంచి రూ.6,500 నుంచి రూ.6 వేలకు ధర పడిపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో రైతులు సీసీఐ కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు.

2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పల్నాడు ప్రాంతంలో దిగుబడులు వచ్చాయి. 1,54,875 ఎకరాల్లో సాగుతో పల్నాడు జిల్లాలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. గుంటూరు జిల్లాలో 53,275 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 4,065 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గుంటూరు, తాడికొండ, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాల, క్రోసూరు, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మార్టూరు, పర్చూరు ప్రాంతాల్లో సీసీఐ కేంద్రాలు మంజూరు కాగా ఆయా కేంద్రాలకు ఇన్‌చార్జిలను కూడా నియమించారు. అయితే కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధరకు ప్రభుత్వం పత్తి కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై మార్కెటింగ్ శాఖ ఏడీఎం సూర్యప్రకాష్‌రెడ్డి వివరణ కోరగా ఇంకా రానున్న వారం రోజుల్లో ప్రారంభమవుతాయన్నారు. సీసీఐకి పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు.

పంచాయతీల కోసం పైరవీలు

- గడువుదాటినా విధుల్లో చేరని కార్యదర్శులు
- నచ్చిన చోటు కోసం కార్యాలయంలో బేరసారాలు
- ప్రజాప్రతినిధులను సైతం పక్కదారి పట్టిస్తున్న వైనం



గుంటూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీల గడువు ముగిసింది. అయినా పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయిన స్థానాల్లో చేరలేదు. తమకు అనుకూలమైన.. కావాల్సిన పంచాయతీలో పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తూనే ఉన్నారు. బదిలీ అయిన పంచాయతీలో జాయిన్ కాకుండా గుంటూరులోని పంచాయతీ అధికారి కార్యాలయం చుట్టూ కొందరు తిరుగుతున్నారు. గ్రేడ్‌తో సంబంధం లేకుండా అధిక ఆదాయం కలిగిన పంచాయతీలో చోటు దక్కించుకునేందుకు నగదు కొట్టేందుకు కూడా సిద్ధమై పావులు కదుపుతున్నారు. డీపీవో కార్యాలయం లోని ఇద్దరు ఉద్యోగులు పైరవీలు చేసే కార్యదర్శులకు అభయ హస్తం అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బదిలీల్లో గ్రేడ్-5 కి చెందిన వారే ఎక్కువ మంది ఇంకా జాయిన్ కాలేదని తెలుస్తోంది. ఉదాహరణకు పిడుగురాళ్ల మండలం పందిటివారిపాలెం, చెన్నాయపాలెం, గుత్తికొండ-2 పంచాయతీలకు బదిలీ అయిన కార్యదర్శులు ఇంకా జాయిన్ కాలేదని సమాచారం. ప్రత్తిపాడు మండలంలో కూడా కొందరు పంచాయతీ

(మిగతా 8లో..)

నేటి నుంచి జే బ్రాండ్స్‌కు బ్రేక్

- జిల్లా వ్యాప్తంగా 117 నూతన మద్యం షాపులు ప్రారంభం
- లైసెన్సు ఫీజు కింద తొలి వాయిదా చెల్లింపు పూర్తి
- ముమ్మరంగా సాగుతున్న బేరసారాలు

బాపట్ల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): నాణ్యతలేని మద్యం బ్రాండులకు ఇకపై స్వస్తి పలికే విధంగా బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా నూతన మద్యం విధానం అమల్లోకి రానుంది. 7 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 117 మద్యం దుకాణాలు కొత్తగా తెరుచుకోనున్నాయి. సోమవారం జరిగిన లాటరీ ప్రక్రియలో భాగంగా షాపులు దక్కించుకున్న వారందరూ సాయంత్రానికే లైసెన్సు ఫీజు కింద చెల్లించాల్సిన తొలి వాయిదా మొత్తాన్ని జమ చేశారు. మంగళవారం స్టాక్ కోసం ఇండెంట్ పెట్టే ప్రక్రియ ఈఎస్ పర్యవేక్షణలో జరిగింది. పదిహేను రోజుల పాటు షాపు దక్కించుకున్న వారికి ప్రొవిజనల్ లైసెన్సును ఎక్సైజ్ శాఖ అందించనుంది. ఈ లోపుగా మద్యం దుకాణం లోకేషన్ విషయంలో నిబంధనల ప్రకారం ఓ నిర్ణయానికి లైసెన్సుదారుడు రావాల్సి ఉంది. అప్పటి వరకు వారివారి పరిధిలో టెంపరరీగా షాపు నిర్వహించుకునే వెసులుబాటును ఎక్సైజ్ శాఖ కల్పించింది. మరోవైపు లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు రద్దీ ఏరియాల్లో షాపు పెట్టడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కాగా ఒకే ప్రదేశానికి ఇద్దరు, ముగ్గురు పోటీ పడే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఒక చోట షాపును పెట్టిన తర్వాత అక్కడ నుంచి మార్చాలంటే ఎక్సైజ్ విభాగానికి అదనపు మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మద్యం షాపు లోకేషన్ విషయంలో లైసెన్సుదారులు ఆచితూచి అడుగేస్తున్నారు

ఇక ప్రైవేటు మద్యం దుకాణాలే...

వైసీపీ పాలనలో ప్రభుత్వ మద్యం షాపులు నిర్వహించేది. కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మద్యం విధానం ప్రకారం బుధవారం నుంచి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మద్యం షాపులు వెళ్లనున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న స్టాకుతో పాటు ఫర్నీచర్ ఇతర ఆస్తులను స్టాక్ డిపోలకు తరలించారు. బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఉన్న మద్యం షాపుల వారు స్టాక్‌ను తెనాలి డిపో నుంచి, ఇటు చీరాల, అద్దంకి, పర్చూరు స్టేషన్ల పరిధిలోని షాపులు ఒంగోలు డిపో నుంచి స్టాక్ తెచ్చుకునేలా ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేసింది



నేతల అనుచరులకు లాటరీలో మొండిచెయ్యి....

దాదాపు ప్రతి చోట పాలకపార్టీ నేతల అనుచరులు పెద్ద ఎత్తున మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోగా లాటరీలో వారందరికీ నిరాశే ఎదురైంది. ఒకట్రెండు చోట్ల మాత్రం సిండికేట్‌గా మారి మెజారిటీ దరఖాస్తులు వేసిన చోట మాత్రం షాపును దక్కించుకోగలిగారు తప్పితే మిగిలిన వారికి మాత్రం లాటరీలో చాలావరకు నిరాశే ఎదురైంది. వీరంతా ప్రస్తుతం సదరు కీలకనేతల వద్ద తమను ఏదోఒక షాపులో భాగస్వాములుగా చేర్చాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దరఖాస్తు రుసుం పేరిట భారీ ఎత్తున నష్టపోయామని తమకు న్యాయం చేయాలని కూడా నేతల వద్ద అనుచరులు వాపోతున్నట్లు తెలిసింది

స్థానికేతరులు....ఎక్కువ షాపులు తగిలిన వారిపై గురి...

మద్యం షాపులకు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసి లాటరీలో ఒక్క షాపు కూడా తగలని తమ వారికి న్యాయం చేయడానికి నేతలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా లాటరీలో షాపు దక్కించుకున్న స్థానికేతరులతో మంతనాలు సాగించడంతో పాటు ఒకే కుటుంబంలో రెండుకు మించి దుకాణాలు గెలుచుకున్న వారితో కూడా తెరవెనక బేరసారాలకు నేతలు దిగినట్లు సమాచారం. బాపట్ల నియోజకవర్గ పరిధిలో రెండు షాపులను పొరుగు జిల్లాలకు చెందిన వారు దక్కించుకున్నారు. సదరు షాపులలో తమ వారిని కూడా భాగస్వాములుగా చేయడానికి పథక రచన చేస్తున్నారు. ఇదే విధంగా రేపల్లెలో రెండు, పర్చూరు పరిధిలో రెండు షాపుల విషయంలో తమ వారిని భాగస్వాములుగా చేసే విధంగా లైసెన్సుదారులను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి

కొంతమంది పక్కకు తప్పుకోవడానికి....

సింగిల్ దరఖాస్తుతో లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు వేరే ఔత్సాహిక వ్యాపారులకు దానిని విక్రయించడానికి సిద్ధపడినట్లు సమాచారం. ఇప్పటికే తొలి విడత లైసెన్సు ఫీజు కట్టినప్పటికీ దానితో కలిపి రూ.40 లక్షలు ఇస్తే తన షాపును వదులుకోవడానికి సిద్ధమనే సంకేతాలను బాపట్ల నియోజకవర్గ పరిధిలోని ఓ లైసెన్సుదారుడు పంపించినట్లు సమాచారం. అదే విధంగా జిల్లాలో నలుగురైదుగురు కలిసి సరదాగా దరఖాస్తు చేసినవారు కూడా లాటరీలో విజయం సాధించారు. ఇలాంటివారు స్వల్ప మొత్తం లాభం చూసుకుని లైసెన్సును అప్పగించడానికి సిద్ధమయినట్లు తెలుస్తోంది. ఇలాంటి వారందరిపై మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారు దృష్టి పెట్టి బేరసారాల ప్రక్రియకు తెరలేపారు.

ఊరూరా.. పల్లె పండుగ

- జిల్లా వ్యాప్తంగా 78 గ్రామాల్లో కార్యక్రమం
- వేజళ్ళవారిలంకలో రహదారులకు అనగాని శంకుస్థాపన
- కూటమి ప్రభుత్వంతోనే గ్రామస్వరాజ్యం సాధ్యమన్న మంత్రి

బాపట్ల, రేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాలు ఊరూర జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం జిల్లాలోని 78 గ్రామాల్లో పలు కార్యక్రమాలు జరిగాయి. పలు అభివృద్ధి పనులకు మంత్రులు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేశారు. కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామంలో జరిగిన పల్లె పండుగలో పాల్గొన్న మంత్రి రవికుమార్ రూ.40 లక్షల ఉపాధి నిధులతో నిర్మించతలపెట్టిన పలు పనులకు భూమి పూజ చేశారు. కర్లపాలెం గ్రామంలోని పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. రేపల్లె మండలం మోర్లవారిపాలెం పంచాయతీ వేజళ్ళవారిలంకలో మంగళవారం జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. రహదారులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో రూ.450కోట్లతో 30వేల పనులు చేస్తున్నామని తెలిపారు. జగన్ తన ప్యాలెస్ కోసం ఎస్సీ, ఎస్టీల ఇళ్లను తొలగించి రోడ్డు వేసుకున్నారేకానీ గ్రామాల గురించి ఎన్నడూ ఆలోచించలేదన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులను దోచేసి దారి మళ్లించారని, సర్పంచ్‌లకు కనీస గౌరవం ఇచ్చిన దాఖలాలు లేకపోగా వారితోనే చీపురి పట్టించారన్నారు. వరద బాధితులకు రూ.కోటి ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ పది పైసలు కూడా ఇవ్వలేదన్నారు. ముందు నుంచి టీడీపీలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన పని లేదని, వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో రూ.89 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి నియోజకవర్గానికి దాదాపుగా పది కోట్లకు పైనే నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వేజళ్ళవారిలంకలో రహదారి అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అనగాని

నిజాంపట్నం కాల్వలో రెండు మృతదేహాలు

అమృతలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా నిజాంపట్నం కాల్వలో రెండు మృతదేహాలు ఉండటంతో కలకలం రేగింది. మండల పరిధిలోని కూచిపూడి లాకు- మండూరు వంతెనల మధ్య కాల్వలో రెండు మృతదేహాలను స్థానికులు గుర్తించారు. కాల్వలో ఆడ, మగ రెండు మృతదేహాలు ఒకే చోట ఉండటం ఆత్మహత్యకు పాల్పడ్డారా అని స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలానికి ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్ చేరుకున్నారు. మృతదేహాలను కాల్వలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టమ్ నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. కూచిపూడి వీఆర్వో విజయకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడిపై కేసు నమోదు

అమృతలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి రూ. 10 వేలు లాక్కున సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లా కేంద్రం బాపట్లకు చెందిన వ్యక్తి గిద్దలూరు వెళ్లేందుకు బాపట్ల బస్టాండ్ వద్ద సోమవారం వేకువజామున వేచి ఉన్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఆ వ్యక్తిని కిడ్నాప్ చేసి కారులో ఎక్కించారు. కారులో అతన్ని అటూ ఇటూ తిప్పి మండల పరిధిలోని ఇంటూరు లాకు వద్ద అతనిపై దాడి చేసి రూ.10 వేలు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. అతన్ని అక్కడ వది లేసి ఆ నలుగురు వ్యక్తులు అదే కారులో ఉడాయించారు. బాధితుడు అమృతలూరులో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం మంగళవారం నాటికి 589.50 అడుగులు ఉంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 6182 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6173 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,638 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లో వాటర్‌గా 44,793 క్యూసెక్కులు నీరు దిగువకు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 44,793 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

వార్డు సచివాలయంలో కుప్పకూలిన సీలింగ్

- తొమ్మిది మంది ఉద్యోగులకు తెనాలిలో తప్పిన పెను ప్రమాదం
- కంప్యూటర్‌లు, ఫర్నిచర్ ధ్వంసం
- వైసీపీ ప్రభుత్వ కాలంలో నాసిరకం పనులే కారణం

తెనాలి, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయ హాల్ సీలింగ్ మొత్తం ఒక్కసారిగా కుప్పకూలింది. కంప్యూటర్‌లు, ఫర్నిచర్ ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో సిబ్బంది, జనం లేకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వైసీపీ ప్రభుత్వ కాలంలో రూ. 49 లక్షలతో నిర్మించిన భవనం పనులు నాసిరకంగా ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో లేకపోవటం వలన ప్రాణాలు దక్కాయని తొమ్మిది మంది సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. తెనాలి పట్టణంలోని చినరావూరు 13వ నంబర్ సచివాలయాన్ని ఒక కమ్యూనిటీ హాల్‌లో మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. దీనికిముందు ప్రభుత్వ సొంత భవనం ఒకటి ఉంటే దానిలో నిర్వహించారు. అయితే ఆ భవనం శిథిల స్థితికి చేరటం, స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండటంతో ప్రమాదకరంగా ఉందని దానిని ప్రస్తుత కమ్యూనిటీ హాల్‌పైకి మార్చారు. కమ్యూనిటీ హాల్ పైభాగంలో రేకులతో హాల్ ఏర్పాటు చేసి, దానిలోకి మార్చారు. శిథిల స్థితిలో ఉన్న భవనంలో ప్రమాదం నుంచి తప్పించుకుందామనుకుంటే, కొత్తగా ఏర్పాటు చేసుకున్న హాల్‌లోనూ సీలింగ్ రూపంలో ప్రమాదం సంభవించింది. అయితే సోమవారం పగలంతా సిబ్బంది పని చేశారని, జనం కూడా తమ పనుల కోసం భారీగానే సచివాలయానికి వచ్చి వెళ్లారని, ఆ సమయంలో ప్రమాదం జరిగి ఉంటే చాలా మంది తీవ్ర గాయాలబారిన పడాల్సి వచ్చేదని సిబ్బంది భయం వ్యక్తం చేశారు. సోమవారం విధులు పూర్తి చేసుకుని ఆ హాల్‌కు తాళం వేసి వెళ్లి పోయామని, మంగళవారం వచ్చి తలుపులు తీసిచూస్తే సీలింగ్ మొత్తం ఊడిపడి ఉందని, కంప్యూటర్‌లు, ఫర్నిచర్‌పై పడటంతో మొత్తం ధ్వంసం అయ్యాయని సిబ్బంది చెబుతున్నారు. సీలింగ్‌తోపాటు విద్యుత్ లైట్లు, వైరింగ్ మొత్తం కిందికి వేలాడుతుంది. ఆ సమాచారాన్ని మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశామని సిబ్బంది చెప్పారు.



తెనాలి 13 వార్డు సచివాలయం హాల్‌లో కుప్పకూలిన సీలింగ్, కంప్యూటర్‌లు, టేబుళ్లపై విరిగి పడిన సీలింగ్ పలకలు



సీలింగ్ ఊడి పడటంతో దెబ్బతిన్న ఫ్యాన్

కాంట్రాక్టర్ బాధ్యత వహించాలి

సంఘటన విషయం తెలుసుకుని వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత పరిస్థితిని పర్యవేక్షించారు. కేవలం కాంట్రాక్టర్ నాసిరకం పనుల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దీనికి కాంట్రాక్టర్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. అయితే సీలింగ్ కుప్పకూలిన పరిస్థితిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ సీలింగ్ దెబ్బతింటే, ఆ దెబ్బతిన్న వరకు పలక ఊడిపడటం సహజం. పెద్ద హాల్ కావడం, మొత్తం హాలులోని సీలింగ్ కుప్పకూలడం అనుమానాలకు తావిస్తోంది. సీలింగ్‌కు వేసిన అల్యూమినియం చానల్స్‌తోసహా ఊడి పడితే పైన రేకుల కప్పు కావటంతో గట్టిదనం లేక ఊడి పడిందనుకోవచ్చు. కానీ రేకులకు అమర్చిన చానల్స్ అన్నీ సక్రమంగానే ఉంటే, కేవలం ప్లాస్టర్‌ఆఫ్‌ప్యారిస్ పలకల వరకే మొత్తం ఊడి పడటం చూస్తే ఎవరైనా కావాలని చేశారా లేక నిజంగా నాసిరకం పనుల వల్లే ఊడి పడిందా అనేది అంతుపట్టని విషయం.

మున్సిపల్ ఇంజనీర్లను పంపించాం..

అయితే సీలింగ్ కుప్పకూలిన ఘటనపై పరిశీలనకు మున్సిపల్ ఇంజనీర్లను పంపించామని, వారు పరిశీలించాక కూలటానికి గల కారణాలపై నిర్ధారణకు వస్తామని, ఆ తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ శేషన్న వివరించారు.

కిక్కుకి.. కొత్త చిక్కు!

- మళ్లీ అమల్లోకి రహదారుల నిబంధన
- రాష్ట్ర రహదారులకు 220 మీటర్ల దూరం పాటించాలి
- దుకాణాల కోసం మద్యం వ్యాపారుల వేట

వేమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం నూతన విధానంలో దుకాణాల ఏర్పాటుకు కొత్త చిక్కు ఏర్పడింది. గతంలో కేంద్ర, రాష్ట్ర రహదారులకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలనే నిబంధనను మళ్లీ అమల్లోకి తేవడంతో మద్యం దుకాణాలు దక్కించుకున్నవారు తలలు పట్టుకుంటున్నారు. ఈ నెల 16 నుంచి ప్రభుత్వ దుకాణాల స్థానంలో ప్రైవేట్ మద్యం దుకాణాలను ప్రభుత్వం అమల్లోకి తెస్తుంది. ఇందుకు సంబంధించి దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ, లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు కూడా ఎక్సైజ్ శాఖ పూర్తి చేసింది. లాటరీలో షాపులు దక్కించుకున్న వారు ఉత్సాహంగా దుకాణాలు ఏర్పాటుకు సిద్ధం కాగా ఎక్సైజ్ శాఖ రాష్ట్ర రహదారులకు 220 మీటర్లు, జాతీయ రహదారులకు 500 మీటర్ల దూరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతో మద్యం వ్యాపారులు కంగుతిన్నారు. ఇప్పటికే ప్రభుత్వ దుకాణాలు ఏర్పాటు చేసిన వాటినే ఎంచుకోగా ఎక్సైజ్ శాఖ నిబంధనతో దుకాణాల కోసం వేట మొదలు పెట్టారు. వాణిజ్య ప్రాంతాలకు దూరంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే ఊరి వెలుపల కాని లేదా నివాస గృహాల మధ్యన కాని చేయాల్సి ఉంటుంది. దీనివల్ల కొత్త తలనొప్పులు వచ్చే అవకాశం ఉంది. నివాస గృహాల మధ్య దుకాణాల ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లోని ప్రజలు గతంలోనే ఎన్నోసార్లు దుకాణాన్ని వ్యతిరేకిస్తూ రోడ్డు ఎక్కారు.

2015లోనే అమల్లోకి..

2015లోనే జాతీయ, రాష్ట్ర రహదారులకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఆ సమయంలో టీడీపీ అధికారంలో ఉంది. అప్పుడు కూడా లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించారు. అయితే నూతన నిబంధన వలన మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఏర్పాటు చేయలేకపోవడం రాష్ట్ర వ్యాప్తంగా జరిగింది. దీంతో ప్రభుత్వం రాష్ట్ర రహదారుల పేరును సవరిస్తూ కొత్త జీవోను తీసుకురావడంతో మూడు నెలల తరువాత వాణిజ్య ప్రాంతాల్లో మద్యం వ్యాపారులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ ఈ నిబంధనను ఇంతవరకు అమల్లోకి తీసుకు రాలేదు. మళ్లీ ఇప్పుడు కొత్తగా రహదారుల నిబంధనను తీసుకురావడంతో మద్యం వ్యాపారులు అయోమయంలో పడ్డారు.

మళ్లీ సవరిస్తారని వ్యాపారుల ఆశలు

రాష్ట్ర రహదారుల వెంబడి మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదనే నిబంధనను ప్రభుత్వం సడలిస్తుందనే ఆశలో వ్యాపారులు ఉన్నారు. లేదంటే వాణిజ్య ప్రాంతానికి దూరంగా నివాస గృహాలకు దగ్గరలో షాపులు ఏర్పాటు వల్ల ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు మద్యపాన ప్రియులు వల్ల ఇబ్బందులు పడతారని ఆ ప్రభావం మద్యం దుకాణాలపై ఉంటుందని వ్యాపారులు చెప్పుకుంటున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి వెంటనే సరైన నిర్ణయం తీసుకోకపోతే నివాస గృహాల సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు వల్ల ప్రజలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశం ఉంది.

రైల్వే ట్రాక్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

- అప్రమత్తతో తప్పిన పెను ప్రమాదం

పొన్నూరుటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాచవరం రైల్వే స్టేషన్ పరిధిలో కుంగిన రైల్వే ట్రాక్‌కు అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ నుంచి రెండు కిలోల మీటర్ల దూరంలో బాపట్ల జిల్లా పరిధిలోని చుండూరుపల్లి గ్రామ సమీపంలో కొల్లిమర్ల డ్రెయిన్ దగ్గర భారీ వర్షాలకు రైల్వే ట్రాక్ సుమారు వంద మీటర్లపైన కుంగింది. సోమవారం రాత్రి తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తున్న సమయంలో రైల్వే ట్రాక్‌లోని లోపాలను గుర్తించారు. ఎక్స్‌ప్రెస్‌ను వెనక్కి మళ్లించి అప్పికట్ల రైల్వే స్టేషన్‌లో గంటపాటు నిలిపివేశారు. వంద మీటర్ల మేర ట్రాక్ భూమిలోకి కుంగిపోయి ఉండటాన్ని గమనించిన అధికారులు తక్షణమే రైళ్ల రాకపోకలను నిలిపేశారు. ఈ ట్రాక్‌పై వేగంగా వెళ్లే వందే భారత్ రైలు ప్రయాణించి ఉంటే పెను ప్రమాదం జరిగేది. ట్రాక్ కుంగిపోయిన ప్రాంతం కేవలం కొల్లిమర్ల డ్రెయిన్‌కు వంద మీటర్ల లోపు ఉంది. ఈ ట్రాక్ పక్కనే వర్షపు నీరు వేగంగా ప్రవహించటంతో భూమి కదిలి మట్టి పక్కకు జారి పోవడాన్ని అధికారులు గుర్తించారు. ఇది విజయవాడ, చెన్నై ప్రధాన లైన్ కావటంతో రైళ్ల రద్దీ అధికంగా ఉంటుంది. తక్షణమే రైళ్ల రాకపోకలను పునరుద్ధరించేందుకు ఇటీవల నూతనంగా నిర్మించిన మూడో లైన్‌ను అధికారులు వినియోగించుకున్నారు. మంగళవారం ఉదయం వందలాది మంది కార్మికులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కుంగిపోయిన ప్రాంతంలో మట్టి లెవలింగ్ చేసేందుకు జేసీబీలను తరలించి పనులు సాగిస్తున్నారు. కుంగిన ట్రాక్‌ను తొలగించి నూతన ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.



కుంగిన రైల్వే ట్రాక్ వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రైల్వేలో స్వచ్ఛత పక్వాడ ముగింపు



విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పదిహేను రోజుల పాటు రైల్వేలో కొనసాగిన స్వచ్ఛత పక్వాడ ముగిసింది. మంగళవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో డీఆర్ఎం ఎం.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 15 రోజుల వ్యవధిలో డివిజన్ వ్యాప్తంగా 500 కిలోమీటర్ల రైల్వేట్రాక్‌ని శుభ్రపరిచినట్లు తెలిపారు. అలానే 4,710 మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను అప్పగించామన్నారు. మరోవైపు స్వచ్ఛతపై పిల్లల్లో అవగాహన పెంచేందుకు అనేక పోటీలు, కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. డివిజన్‌లోని 56 రైల్వేస్టేషన్లలో నిత్యం స్వచ్ఛత కార్యక్రమాలు అమలు చేశామని, దాదాపుగా 4 వేల మంది ఈ పక్షం రోజుల పాటు శ్రమదానంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. 55 రైళ్లలో తనిఖీలు నిర్వహించి అపరిశుభ్రంగా మారుస్తున్న 23 మందికి జరిమానా విధించామన్నారు. మొత్తంగా 10 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించామని, సదస్సులు, వెబినార్లలో 1200 మంది పాల్గొన్నారని చెప్పారు. స్వచ్ఛత పక్వాడ ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను డీఆర్ఎం ప్రదానం చేశారు.

22న విధుశేఖర భారతి మహాస్వామి రాక

గుంటూరు, కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శృంగేరి శారదా పీఠాధిపతులు విధుశేఖర భారతి మహాస్వామి వచ్చే నెల 22, 23 తేదీల్లో గుంటూరుకు రానున్నట్లు పీఠం ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావుని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. నవంబరు నెలలో జరిగే విజయ యాత్రలో భాగంగా స్వామిజీ గుంటూరు వస్తున్నారని, స్వామిజీని కలిసి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. ఈ నెల 17 నుంచి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో స్వామిజీ విజయ యాత్ర జరుగుతుందని, అందులో భాగంగా వచ్చే నెల 13న ఆంధ్రాలోకి వస్తారని తెలిపారు. తొలుత తిరుపతికి చేరుకుంటారని, అక్కడ నుంచి ఆంధ్రాలోని పలు ప్రాంతాల్లో స్వామిజీ విజయ యాత్ర కొనసాగుతుందన్నారు. వచ్చే నెల 22, 23 తేదీల్లో స్వామిజీ గుంటూరులోనే ఉంటారని వారు చెప్పారు. కార్యక్రమంలో పీఠం ప్రతినిధులతోపాటు ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓవీ రమణ పాల్గొన్నారు.



డీజీపీ ద్వారక తిరుమలరావుకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న శృంగేరి పీఠం ప్రతినిధులు, డాక్టర్ ఓవీ రమణ

ఆడిట్ రికార్డుల పరిశీలన

గుంటూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐదో ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిషత్ బడ్జెట్, సంవత్సరిక లెక్కలు, ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్, ఆడిట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గుంటూరు రూరల్ మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ప్రొఫెసర్ ఎంవీఎన్ పద్మారావు, కె.కృపారావు, తాక్విద్దీన్ ఈ పర్యటనలో పాల్గొన్నారు. జెడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, ఏవోలు డి.రామకోటయ్య, జె.శోభారాణి, నాగరాజు ఫైనాన్స్ కమిషన్ సభ్యులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.



డిప్యూటీ సీఈవోతో సమావేశమైన రాష్ట్ర ఐదో ఫైనాన్స్ కమిషన్ సభ్యులు

నేటి నుంచి నారా చంద్రబాబు నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అభినయ థియేటర్ ట్రస్ట్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు నారా చంద్రబాబు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. ప్రతిరోజూ రెండు నాటిక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ప్రదర్శనల్లో భాగంగా బుధవారం సాయంత్రం శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం, శ్రీకాకుళం జిల్లా వారిచే కొత్త పరిమళం, కేజేఆర్, కల్చరల్ అసోసియేషన్ సికింద్రాబాద్ వారిచే సాహితి సూక్తం, గురువారం సాయంత్రం పూర్ణదయ ఆర్ట్స్ చీరాల వారిచే నేనేం చేసుకుంటాను, సాయి కార్తీక్ క్రియేషన్ కాకినాడ వారిచే ఎడారిలో వానచినుకు, శుక్రవారం సాయంత్రం కళాంజలి, హైదరబాదు వారిచే రైతేరాజు, శృంగార వల్లభ ఆర్ట్స్ తిరుపతి వారిచే కబ్జా నాటిక ప్రదర్శనలు జరుగుతాయని వివరించారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న చెస్ అసోసియేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): లీలావతి మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్-15 బాల, బాలికల చదరంగం పోటీలు స్థానిక గోరంట్ల, నెక్స్‌జెన్ పాఠశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలను పాఠశాల కో ఆర్డినేటర్లు లక్ష్మీగాయత్రి, శ్రీకాంత్, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, స్టేట్ జాయింట్ కార్యదర్శి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దేవుళ్ల పేర్లు వద్దు



బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్

గుంటూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం షాపులకు వివిధ మతాలకు చెందిన దేవుళ్ల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం గుంటూరు నగరంలోని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన మద్యం పాలసీ టెండర్లు, లాటరీల ప్రకారం ఈ నెల 16వ తేదీ నుంచి నూతన మద్యం షాపులు ప్రారంభమయ్యే సందర్భంలో అధికారులు అప్రమత్తం కావాలని కోరారు. 2014 - 2019 వరకు ఉన్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మద్యం షాపులకు దేవుళ్ల పేర్లు పెట్టకూడదని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. అదే జీవోను ఈ ప్రభుత్వంలో కూడా కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని, తద్వారా వివిధ మతాల భక్తుల మనోభావాలను, ఆధ్యాత్మికత గౌరవాన్ని చాటిచెప్పేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వివిధ మతాల ప్రార్థనాలయాలు, ప్రార్థన స్థలాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద షాపులు ఏర్పాటు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి మృతి



నాగేంద్రం (ఫైల్ ఫొటో)

మాచర్లటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్ బుట్టి నాగేంద్రం మృతి చెందారు. నాగేంద్రం పట్టణంలోని రింగురోడ్డులో గల ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఈమె ఇటీవల బాపట్ల నుంచి మాచర్లకు బదిలీపై వచ్చారు. మంగళవారం అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో తాము నివాసముంటున్న టెర్రస్ నుంచి కిందకు చూస్తూ ప్రమాదవశాత్తూ కిందకి పడిపోయింది. కుమారుడు వెంకటేష్ తల్లి నాగేంద్రంను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.ప్రభాకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరికి జైలు.. ఇద్దరికి జరిమానా

గురజాలటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం గురజాల పట్టణంలో సీఐ భాస్కర్ ఆధ్వర్యాన డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణ తీర్పునిస్తూ జిల్లెల్ల శ్రీనివాసరావు, షేక్ సుభానికి రూ.10 వేల చొప్పున జరిమానా, దుర్గారావుకు 15 రోజుల జైలు శిక్ష విధించినట్టు సీఐ భాస్కర్ తెలిపారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 36,250 క్యూసెక్కులు

తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 3,572 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 39,822 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 3,572 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. కాగా మహానాడు, సుందరయ్యనగర్ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి తహసీల్దార్ ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి వెళ్లొద్దని తహసీల్దార్ సూచించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 30,560 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,798 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా దీనిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

35,674 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 38,191 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,674 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 22,325 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8700	16000	334	8500	14500
నెంబరు. 5	9500	13500	నెంబరు. 5	12500	12500
273	11000	16000	273	11000	13000
341	8000	16500	341	9000	16000
4884	12000	15000	4884	13000	14500
సూపర్ 10	--	--	సూపర్ 10	14900	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	9000	18500	తేజ	9200	18300
బ్యాడిగి	9500	15000	బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	9500	13000	దేవనూరు డీలక్స్	10000	15500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

వరద బాధితుల సహాయార్థం విశ్రాంత సైనికుల వితరణ



సీఎం చంద్రబాబునాయుడుతో రాష్ట్ర త్రిదళ విశ్రాంత సైనికులు

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు సాయం అందించేందుకు ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్‌కు రాష్ట్ర త్రిదళ విశ్రాంత సైనికులు చేయూత నందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి రూ.2,59,506 డీడీని అందజేశారు. వెలగపూడి ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రిని రాష్ట్ర మాజీ సైనికుల లీగ్ ముఖ్యాలయ ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస వరప్రసాద్ కలిసి డీడీని అందజేశారు. రాష్ట్రంలో మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సైనికుల సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు.

మహిళలు తమ హక్కులను సద్వినియోగపరచుకోవాలి

వేమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ ఝాన్సీ అన్నారు. వేమూరులోని రోశయ్య మీటింగ్ హాలులో మంగళవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మహిళలకు విధాన్ సే సమాధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ, గృహహింస చట్టం, వరకట్న వేధింపులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. రీసోర్స్‌పర్సన్ షేక్ అమీనా రహమనీయ మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషనర్ గురించి, మానవ అక్రమ రవాణా తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. వేమూరు ఎస్ఐ జి.రవికృష్ణ మాట్లాడుతూ, మహిళలు అన్యాయం జరిగినప్పుడు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది మహబూబ్, సరళ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్ళు వేగవంతం చేయాలి

బాపట్ల,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్నులు, నీటిపన్ను వసూళ్ళు వేగవంతం చేయాలని మున్సిపల్ కమీషనర్ జి.రఘునాధరెడ్డి, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొండి బకాయిలు త్వరితగతిన వసూళ్ళు చేయాలని ఆదేశించారు. పైపులైన్ లీక్‌ల విషయంలో అలసత్వం వహించకూడదన్నారు. సమావేశంలో ఆర్‌వో జబ్బార్, మున్సిపల్ డీఈ కె.శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి కల్పించండి

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో చదువుకొని ఖాళీగా ఉన్న దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ జనసేన పార్టీ దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు కేటాయించటంతోపాటు చిరువ్యాపారం చేసుకుంటున్న దివ్యాంగులకు గుర్తింపుకార్డులివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసుందర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన షేక్ సలీమాను మంగళవారం తెలుగుయువత నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. వివిధ అంశాలపై తహసీల్దార్‌తో చర్చించారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి అడే వంశీ, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్, 33వ వార్డు ప్రెసిడెంట్ ఐనంపూడి షాలెంరాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు దారా అశోక్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు యోహాను, మార్పు ఆనంద్, బాజి, పాముల వరదానం తదితరులు ఉన్నారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మద్యం అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబుపై విమర్శలు : కొల్లా

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయంలో మద్యం వ్యాపారాన్ని తన సొంత ఆదాయ వనరుగా మార్చుకొని అధిక ధరలకు నాసిరకం మద్యం విక్రయించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తనమద్యం అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అవాకులు, చెవాకులు పేలుతున్నాడని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం పారదర్శకతతో సిండికేట్‌లకు ఆస్కారం లేకుండా దరఖాస్తు చేసుకున్న వారికి లాటరీ పద్దతితో దుకాణాలు కేటాయించటం జరిగిందన్నారు.

స్విమ్మింగ్ పోటీలలో అవిజ్ఞకు పతకాలు



సీహెచ్ అవిజ్ఞ

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్లకు చెందిన సీహెచ్ అవిజ్ఞ ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్విమ్మింగ్ పోటీలలో పాల్గొని 4 సిల్వర్‌మెడల్స్, 3 బ్రౌంజిమెడల్స్ సాధించింది. 50మీటర్ల ఫ్రీస్టయిల్ పోటీలలో సిల్వర్, 100మీటర్లలో బ్రౌంజిమెడల్ గెలుపొందింది. 100మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలలో బ్రౌంజిమెడల్, 200మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలలో బ్రౌంజిమెడల్, 100మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే పోటీలలో సిల్వర్‌మెడల్, 100 మీటర్ల మేడ్లి రిలే పోటీలలో సిల్వర్ మెడల్ సాధించి బాపట్ల సత్తా చాటారు. క్రీడాకారిణి అవిజ్ఞను, శిక్షణ ఇచ్చిన వారిని పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బాపట్ల,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం ఉదయం 8గంటలు నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. 11 కెవి మరమ్మతుల నిమిత్తం శాంతినగర్, విజయలక్ష్మీపురం, భీమావారిపాలెం, ఇమ్మడిశెట్టిపాలెం, భావరాజుతోట, రెల్లికాలనీ, రైలుపేట, శాంతినగర్, శారదాపురి కాలనీ, ఉప్పరపాలెం, జమేదార్ పేట, మూలపాలెం లేఅవుట్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు.

● రేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా పట్టణంలోని జేఎల్‌బీ కాలేజ్ రోడ్డు, నిజాంపట్నం రోడ్డుకు ఉత్తరం వైపు, గరువురోడ్డు, బేతపూడి, ఉయ్యూరువారిపాలెంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు.

గోకులంషెడ్‌కు శంకుస్థాపన

బాపట్లరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : పల్లెపండుగలో భాగంగా మంగళవారం కొండుభొట్లవారిపాలెం గ్రామంలో గోకులంషెడ్‌కు శంకుస్థాపన కార్యక్రమాన్ని బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల తెలుగుదేశం యువత అధ్యక్షులు ఉమారెడ్డి వెంకటేష్, తెలుగుదేశం గ్రామపార్టీఅధ్యక్షులు కొండలు, బూత్ ఇన్‌చార్జి మార్పు ప్రతాప్, పసుమర్తి ఆనందబాబు, దాసరి బుల్లిబాబు, కాగిత ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

● పట్టించుకోని అధికారులు



బాపట్ల పాతబస్టాండ్ కూడలిలో అక్రమంగా నిర్మిస్తున్న ఎన్జీవోస్ అసోసియేషన్ షాపింగ్ కాంప్లెక్స్

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలో అక్రమ కట్టడాలు నానాటికి పెరిగిపోతున్నాయి. వైసీపీ పాలనలో అడ్డూఅదుపు లేకుండా అక్రమ కట్టడాలు నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ కట్టడాలకు తావులేదని, అప్పులలో ఉన్న మున్సిపాలిటికి ఆదాయం పెంచేవిధంగా ప్రతి కట్టడానికి అనుమతులు తప్పవని పాలకులు, అధికారులు ఆర్భాటంగా ప్రకటించారు. ప్రస్తుతం అయితే అలాంటి పరిస్థితి కనిపించటం లేదు. అక్రమ కట్టడాలు యదేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. బాపట్ల పాతబస్టాండ్ కూడలిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనే ఎన్జీవోస్ అసోసియేషన్‌వారు పెద్ద ఎత్తున షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. అధికారులు, పాలకులు దీనికి మద్దతుగా నిలిచారని విమర్శలున్నాయి. సూర్యలంక రోడ్డులో రెండు అపార్ట్‌మెంట్‌ల నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారని నిలిపివేశారు. ఇక్కడ మాత్రం ఏవిధమైన అనుమతులు లేకుండా కాంప్లెక్స్ నిర్మిస్తుంటే కనీసం ప్రశ్నించటం కూడా మానేశారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు మున్సిపల్ అధికారులకు, జిల్లా అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. ప్రభుత్వ భూమిలో కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అక్రమ కట్టడానికి ఓ వైపు మండల పరిషత్ కార్యాలయం, మరోవైపు పోలీసు కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయం, మండల విద్యావనరుల కేంద్రం, వెలుగు కార్యాలయం ఉన్నాయి. వీటి మధ్య ఎన్జీవోస్ అక్రమ నిర్మాణం చేయటం అనేక విమర్శలకు దారితీస్తున్నది. కాగా ఈవిషయమై మున్సిపల్ అధికారులను సంప్రదిస్తే షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతులు ఇవ్వలేదని సదరు భూమి మాత్రం ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధీనంలో ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఈవిధంగా విమర్శలకు కారణమైన ఎన్జీవోస్ అసోసియేషన్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ విషయంలో పాలకులు, అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చి అక్రమ కట్టడాల విషయంలో వారి వైఖరిని తెలియజేయాలని పట్టణ ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు. కాగా నిన్నటి వరకు గ్రౌండ్ ఫ్లోర్ వరకు నిర్మించిన ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు ప్రస్తుతం పైన అంతస్తు కూడా నిర్మిస్తున్నారు. అసోసియేషన్ పేరుతో వ్యాపార సంస్థల సముదాయాన్ని నిర్మిస్తున్నారంటూ విమర్శలు చేస్తున్న అధికారులు మాత్రం తమకేమి తెలియదన్నట్లు చోద్యం చూస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



వేజళ్ళవారిలంకలో రహదారి అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి

గ్రామస్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

● రాష్ట్రంలో రూ.4500కోట్లతో 30వేల పనులు

● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్వరాజ్యం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్రంలో రూ.450 కోట్లతో 30 వేల పనులు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం మోర్లవారిపాలెం పంచాయతీ వేజళ్ళవారిలంకలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రహదారులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో వెయ్యి కిలోమీటర్లు కూడా రహదారులు వేయలేని పరిస్థితి అని, జగన్‌ప్యాలెస్ కోసం ఎస్సీ, ఎస్టీ కుటుంబాల ఇళ్లను తొలగించి ఆయన ఇంటికి రహదారిని వేసుకున్నారే తప్పా గ్రామాల గురించి ఎన్నడూ ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్రాభివృద్ధికోసం కలిసికట్టుగా పని చేస్తూ ముందుకు వెళుతున్నారన్నారు. మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు చంద్రబాబుసమక్షంలో టీడీపీలో చేరారని, జగన్ చేసే పనులు నచ్చకే పార్టీని వీడారని పార్టీలోకి వచ్చిన మోపిదేవిని గౌరవిద్దామన్నారు. ముందు నుంచి టీడీపీ నుంచి పని చేసిన నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన పనిలేదని వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



ఐలవరంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

గ్రామాల్లో మౌలిక వసతుల రూపకల్పనకు కృషి

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

కర్లపాలెం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల రూపకల్పనకు పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. కర్లపాలెం గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని గ్రామసర్పంచ్ నక్కా లలితకుమారి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొని రోడ్డు నిర్మాణ పనులు లాంచనంగా ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రతి గ్రామానికి వెలుగులు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ హరేరామకృష్ణ, డ్వామా పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, నాయకులు పఠాన్‌ఖాన్, పమిడి వెంకటరాజు, చిలకల సురేంద్రబాబు, పఠాన్ రాజేష్, మంతెన హరిజితేంద్ర వర్మ, కార్యదర్శి సునీత, గవిని ప్రసాద్, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

గ్రామాలకు మహర్దశ : ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రారంభించిన పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు మహర్దశ ఏర్పడనుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని చావలిలో రూ.20 లక్షల వ్యయంతో, పెరవలిలో రూ.15 లక్షల వ్యయంతో, పెరవలిపాలెంలో రూ.10 లక్షల వ్యయంతో, భట్టిప్రోలు మండలం ఐలవరంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఒక లక్ష్య సాధనతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ పల్లెల ప్రగతికి ముందుకు అడుగులు వేస్తున్నారని చెప్పారు. జగన్ పాలనలో పంచాయితీరాజ్ శాఖకు సంబంధించిన నిధులు కోట్లాది రూపాయలు దారి మళ్లించడం జరిగిందని తద్వారా గ్రామాలను దౌర్భగ్యమైన స్థితి గ్రామాల్లో చూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దండే వెంకట సుబ్బారావు, జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, ఇక్కుర్తి నాగయ్య, బండారు సూరిబాబు, దాది లక్ష్మణ్, కంచి సీతారామయ్య, దాసరి చిన్న, పుసులూరి సాంబశివరావు, తహసీల్దార్ సుశీల, ఇన్‌చార్జి ఎంపీడీవో అనురాధ, పంచాయితీరాజ్ డీఈఈ శ్యాంప్రసాద్, ఏఈ బదరీనారాయణ, ఈవోపీఆర్‌డీ శేఖర్, ఏపీవో సత్యకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని పునఃనిర్మించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని ఐలవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రూ.50 లక్షల నిధులతో నిర్మించుకున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో బాపట్ల, రేపల్లె జాతీయ రహదారి నుండి ఐలవరంలోకి వచ్చే ప్రధాన రహదారిని కూడా పట్టించుకోలేదన్నారు. చిన్న వంతెన నుండి మారీ డొంక వరకు రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో రమణ, ఈవోపీఆర్డీ ఊహారాణి, ఏపీఎం శ్రీమన్నారాయణ, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. మండల పరిధిలోని ఆవులవారిపాలెం, పెసర్లంక గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఒక్కో గ్రామంలో రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఈవోపిఆర్‌డి సునీత, ఏపీఎం లక్ష్మి, పిఆర్ఏఈ పాపారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెం, జివిఎన్‌పాలెం గ్రామపంచాయతీలలో మంగళవారం పల్లెపండుగ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఐ.సత్యనారాయణ, ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు కె.అనూష ప్రసన్న, యెనుముల పార్వతి, దబ్బుకూటి మాధవరావుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని ఆర్‌అండ్‌బి రహదారి నుంచి శ్రీకాశీ విశ్వనాధ దేవస్థానం వరకు నూతనంగా రూ.11లక్షలతో నిర్మించే రోడ్డుకు, ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఖాజీపాలెం మాజీ సర్పంచ్, టీడీపీనాయకులు మంతెన కృష్ణమూర్తిరాజులతో కలిసి 19లక్షల 60 వేలతో నిర్మించే ఆయా గ్రామాలలోని సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. పోతనకట్టవారిపాలెం గ్రామపంచాయతీలో 7 లక్షల 50 వేలతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. జివిఎన్‌పాలెం గ్రామపంచాయతీలో రూ.20 లక్షలతో నిర్మించే పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాలలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు దాసరి వెంకటశివకుమార్, కె.గోపికృష్ణ, సీహెచ్ సుధాకర్, ఖాజీపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు దండు శ్రీనివాసరాజు, కొత్తపల్లి పృధ్వీరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పమిడి వెంకటరామయ్య, గూడారు వెంకయ్య పి.గోపిరాజు, హరిబాబు, పంచాయతీ సిబ్బంది,ఆయాపార్టీలనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

● ప్రోగ్రాం మేనేజర్ వి.వాణిశ్రీ



రైతులకు జీవామృతం తయారు చేసే విధానం గురించి ప్రయోగాత్మకంగా తెలియజేస్తున్న వ్యవసాయాధికారులు

బాపట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : రైతులు సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రోగ్రాం మేనేజర్ వి.వాణిశ్రీ తెలిపారు. మండలంలోని నరసాయపాలెం గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వాణిశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రకృతి వ్యవసాయం, ఎరువులు, పురుగుమందులు, కలుపు మందులు వాడకుండా సేంద్రియ పద్దతితో వ్యవసాయం చేసే ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. జీవామృతం తయారు చేయించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కంకటపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏడీఏ ఎ.లక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొని క్షేత్ర సందర్శన ద్వారా మేలైన వ్యవసాయ పద్దతులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

నగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా రైతులను ప్రోత్సహించటం జరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.వాణిశ్రీ అన్నారు. మండల పరిధిలోని ఉల్లిపాలెంలో పొలాల వద్ద రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్దతులను అనుసరించి వరి పంటలో పురుగులు, తెగుళ్ళకు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఎ.రమేష్‌బాబు, వ్యవసాయ విస్తరణాధికారి కె.నాగశ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.పూజ, ఎం.ప్రియాంక, టీడీపీ నాయకులు నాగళ్ళ శ్రీహరి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు బియ్యం పంపిణీ



చేనేత కుటుంబాలకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఐలవరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇటీవల భారీ వర్షాల వల్ల చేనేత మగ్గం గుంటల్లోకి నీరు చేరి ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అందించిన పది కిలోల బియ్యాన్ని మంగళవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా, టీడీపీ నాయకులు బట్టు మల్లికార్జునరావు, మాచర్ల నాగరాజు, దీపాల శివప్రసాద్, వామనపల్లి కోటేశ్వరరావు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

వేమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చావలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బోడపాటి బాలసూర్యప్రసాద్‌ను మంగళవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఇటీవల ప్రసాద్ కాలుకు గాయమై చికిత్స పొందుతున్నారు. ఆనందబాబు ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ దండే వెంకటసుబ్బారావు, బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆలోచనలను అనుసరించాలి : ఎంపీ



ఎంపీ కార్యాలయం వద్ద అబ్దుల్ కలాం పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం ఆలోచన విధానాలని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. అదేవిధంగా ఎంపీ కార్యాలయం వద్ద అబ్దుల్ కలాం పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి ఎంపీ మాట్లాడుతూ మిసైల్‌మ్యాన్‌గా, రాష్ట్రపతిగా దేశానికి ఆయన విశిష్ఠ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు, టీడీపీ నాయకులు పఠాన్ రాజేష్, సీనియర్ నాయకులు దొప్పలపూడి రామ్మోహనరావు, నక్కా ప్రకాశరావు, గవిని ప్రసాద్, కె.ఏడుకొండలు, కొక్కిరాల రాజేంద్ర, సిరాజ్, సాయిబాబు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, నాయకులు, అధికారులు పాల్గొని కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ హరేరామకృష్ణ, డ్వామా పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, పఠాన్‌ఖాన్, పమిడి వెంకటరాజు, చిలకల సురేంద్రబాబు, గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, కార్యదర్శి సునీత, పఠాన్ రాజేష్, మంతెన హరి, జితేంద్రవర్మ, నక్కా ప్రకాశరావు, గవిని ప్రసాద్, కె.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశరక్షణ రంగ సార్వభౌమత్వ సాధనలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పాత్ర అద్వితీయమైనదని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. అబ్దుల్‌కలాం జయంతి కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జమ్మద్ బాషా, ఉపాధ్యాయులు మాణిక్యారావు, జాన్‌వెస్లీ, లలిత, పద్మజ, శేషాద్రినాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని అబ్దుల్‌కలాం విగ్రహానికి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గుదే రాజారావు పార్టీశ్రేణులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. కలాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దళిత బహుజన ఐక్యవేదిక కన్వీనర్ తురిమెళ్ళ అమ్మేశ్వరరావు, రేగుల గడ్డ చంద్రశేఖర్, బడుగు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య ఆధ్వర్యంలో మంగళవారం కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యారం శేఖర్‌బాబు, ఆకురాతి విష్ణుమూర్తి, తన్నీరు సూరి, కత్తుల వెంకటేశ్వర్లు, కుంచాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు టిఎం రావు ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, హెచ్‌ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ సుగుణకుమారి, బి.శ్రీనివాసరావు, చేబ్రోలు శ్రీనివాసరావు, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు. అలాగే వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం కె.అరుణకుమారి తెలిపారు. కార్యక్రమానికి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు పొన్నపల్లి సత్యనారాయణ హాజరై పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.శివరామకృష్ణ, కె.మురళీమోహన్, రెడ్డి సుధాకర్, శైలజ, శివరామకృష్ణ శ్రీనివాసరావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఇంజనీర్ దండు లక్ష్మీ నరసరాజు, గోకరాజు కృష్ణంరాజు సంయుక్తంగా కలిసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని ఖాజీపాలెం, చందోలు, మంతెనవారిపాలెం శాఖా గ్రంథాలయాలలో అబ్దుల్ కలాం జయంతిని ఆయా గ్రంథాలయ శాఖల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

రేపటి నుంచి ఏఎన్‌యూ
దూరవిద్య పరీక్షలు

పెదకాకాని, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా యూజీ, పీజీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఈ మేరకు మంగళవారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ దూరవిద్య పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేందుకు చీఫ్ సూపరింటెండెంట్ల సహకారం కీలకమన్నారు. అలాగే దూరవిద్య కేంద్రానికి 10 పీజీ సైన్స్ కోర్సులకు అనుమతి వచ్చిందని త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దూరవిద్యా కేంద్రం పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి. రామచంద్రన్ మాట్లాడుతూ దూరవిద్య పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా పరీక్షల నిర్వహణకు ప్రతి పరీక్షా కేంద్రంలో అబ్జర్వర్, రీజనల్ కోఆర్డినేటర్, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, అకడమిక్ కౌన్సిలర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ కరీముల్లా సస్పెన్షన్

- వెంకటాచలం పీఎస్‌లో బంగారం మాయం
- నివేదిక ఇచ్చిన సీఐ, డీఎస్పీ
- చర్యలు తీసుకున్న ఐజీ త్రిపాఠి

నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో జిల్లాలో పనిచేసి ప్రస్తుతం గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న వివాదాస్పద ఎస్ఐ కరీముల్లా సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ్ త్రిపాఠి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో వెంకటాచలం ఎస్ఐగా కరీముల్లా పనిచేస్తున్న సమయంలో ఓ కేసుకు సంబంధించి సుమారు 800 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశారు. అయితే ఈ బంగారం పోలీసు స్టేషన్ నుంచి మాయమైంది. ఎస్సై ఆధీనంలో ఉండాల్సిన బంగారం మాయమైనట్లు ఏడాది క్రితమే వెలుగులోకి వచ్చింది. కానీ నాడు పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని రాజకీయ ఒత్తిళ్లతో పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారాక వెంకటాచలం స్టేషన్‌కు కొత్త సీఐగా సుబ్బారావు బాధ్యతలు తీసుకున్నారు. చార్జ్ తీసుకున్న సందర్భంగా అన్ని కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను ఆయన పరిశీలించుకున్నారు. కానీ బంగారం మాత్రం స్టేషన్‌లో లేకపోవడంతో వెంటనే ఈ విషయాన్ని నివేదిక రూపంలో ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు తెలియజేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన కూడా వెంకటాచలం స్టేషన్‌లో బంగారం మాయమైనట్లు నిర్ధారించి, అందుకు అప్పటి ఎస్సైను బాధ్యుడిగా నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నివేదికలను జిల్లా ఎస్పీ గుంటూరు రేంజ్ ఐజీకు పంపారు. వీటిని పరిశీలించిన ఐజీ.. ఎస్సై కరీముల్లాను సస్పెండ్ చేశారు. అయితే ఎప్పుడో రెండేళ్ల క్రితం బంగారం మాయమైతే ఇన్నాళ్లూ అక్కడ పనిచేసిన పోలీసు అధికారులు ఎందుకు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్న అనుమానాలు కలుగుతున్నాయి. కాగా ఈ వ్యవహారంపై ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను వివరణ కోరగా ఎస్సైను సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనని చెప్పారు.

కౌలు కోసం రైతుల పాట్లు!

ఒక ఏడాది కౌలే చెల్లించిన ప్రభుత్వం

రెండో ఏడాది బకాయిపై స్పష్టత కరువు

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల కౌలు కష్టాలు కూటమి ప్రభుత్వం వచ్చినా తీరడం లేదు. గత ప్రభుత్వం కక్షకొద్దీ ఆపిన రైతుల కౌలు ఈనాటికీ వారికి దక్కడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఒక ఏడాది కౌలు మాత్రమే చెల్లించడంతో రైతులు నిరాశకు గురయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలు చెల్లించకుండా ముప్పుతిప్పలు పెట్టింది. గడిచిన ఐదేళ్లలో కోర్టు మెట్లెక్కకుండా రైతులకు కౌలు దక్కిన దాఖలాలే లేవు. చివరికి కోర్టు తీర్పులు, ఆదేశాలను కూడా పెడచెవిన పెట్టిన వైసీపీ ప్రభుత్వం ఆఖరి రెండేళ్లల్లో ఒక్క రూపాయి కూడా కౌలు చెల్లించలేదు. రెండేళ్లకు కలిపి రూ.400 కోట్ల వరకూ రైతులకు బకాయి పెట్టింది. ఇప్పుడు ఆ భారమంతా కూటమి ప్రభుత్వంపైనే పడింది. రెండేళ్ల బకాయిలు అందుతాయనుకుంటే.. కూటమి ప్రభుత్వం గత నెల 16న ఒక ఏడాది కౌలే చెల్లించింది. ఈ ఏడాది 10 శాతం పెంచి, రూ.210 కోట్ల కౌలు చెల్లించాల్సి ఉంది. మరోవైపు గత మూడేళ్లుగా అసైన్డ్ రైతులకు కలగా మారిన కౌలు ఎట్టకేలకు వారికి దక్కింది. సీఐడీ విచారణ పరిధిలోలేని 1400 మంది రైతులకు మూడేళ్ల కౌలు చెల్లించేసింది. దీంతో మిగిలిన రైతులకు కూడా తక్షణమే బకాయి కౌలు విడుదల చేయాలని రైతులు కోరుకుతున్నారు.

కూటమి ప్రభుత్వం పేదల పెన్నిధి: వర్ల

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కర్లపూడి వెంకాయమ్మ... గుంటూరు జిల్లా కంతేరుకు చెందిన ఒంటరి మహిళ. కిడ్నీ సమస్యతో బాధపడుతున్నానని, తమకు ఇల్లు కూడా లేదని, తన కుమారుడికి ఉపాధి కల్పించాలని 45 రోజుల క్రితం సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ఆమెకు సాయం చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆమెకు రూ.1.80 లక్షలతో ఇల్లు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. అలాగే ఆమె కుమారుడు వంశీకి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సబార్డినేట్ ఉద్యోగం ఇస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎన్డీయే ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని చెప్పడానికి వెంకాయమ్మ కుటుంబానికి చేసిన సాయమే నిదర్శనం. ఈ సందర్భంగా వెంకాయమ్మకు, వంశీకి ప్రభుత్వ ఉత్తర్వులను వర్ల అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి పాతర్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెనక్కి నడుద్దామా..



బ్యాక్ వాకింగ్‌తో శక్తివంతంగా తయారవుతారు. మామూలుగా ముందుకు ఎంత వేగంతో నడుస్తారో వెనక్కి కూడా అంతే వేగంగా నడిస్తే 40 శాతం క్యాలరీలు ఖర్చు అవుతుందని, శరీరంలో కొవ్వు తగ్గుతుందని వెస్ట్ లండన్ యూనివర్సిటీ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. రోజూ 10 నుంచి 30 నిమిషాలు వెనక్కి నడిస్తే వారంలో 2-4 సార్లు జాగింగ్ చేసిన దాంతో సమానమని, శరీరం దృఢంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.



వెనుకడుగు అంటే జీవితంలో వెనకపడిపోవడం అంటారు. కానీ ఆరోగ్యం విషయంలో వెనకడుగు వల్ల ఎంతో మేలు జరుగుతుంది. సాధారణంగా వాకింగ్ అనేది ఎంతో ఆరోగ్య కరం. దీర్ఘకాలిక రోగాలు రాకుండా కొందరు నడక సాగిస్తుండగా.. మరికొందరు రోగా లు తగ్గేందుకు వాకింగ్ చేస్తుంటారు. నేటి ఆధునిక జీవనంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు వయస్సు తారతమ్యాలు లేకుండా వాకింగ్, జాగింగ్ అనేది నిత్యకృత్యంగా మారింది. వాకింగ్ మాన వ జీవనంలో ఒక భాగమైందంటే ఆశ్చర్యం కాదు. అయితే ఈ వాకింగ్‌లో కూడా బ్యాక్ వాకింగ్ అనేది అత్యుత్తమ మని.. రకరకాల అనారో గ్యా లకు ఇదే దివ్య ఔషధం లాంటిదని వైద్యులు సూచిస్తున్నారు.

- బ్యాక్‌వాకింగ్‌తో ఎంతో మేలు
- అదుపులో కొలెస్ట్రాల్, బీపీ, షుగర్
- రోజుకు 10-30 నిమిషాలతో ఆరోగ్యం
- వెనుకడుగులతో రక్త ప్రసరణ వేగవంతం
- బ్యాక్ రన్నింగ్ అలవరుచుకోవాలని సూచన

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొన్ని సార్లు వెనుక అడుగువేయాలని పెద్దలు చెబుతారు. ఇదే విషయాన్ని ఆరోగ్యంలో కూడా పాటించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాకింగ్‌తో కొలెస్ట్రాల్, అధిక బరువు, బీపీ, షుగర్ నియంత్రణలో ఉంటాయి. ముఖ్యంగా గుండె క్రియాశీలకంగా పనిచేస్తుంది. ఈ విషయాలు అందరికీ తెలిసిందే. కానీ బ్యాక్‌వాకింగ్ వల్ల శరీరా నికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబు తున్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా క్యాలరీలు ఖర్చు చేయించే వ్యాయామం వాకింగ్ మాత్రమే. వాకింగ్ వల్ల శరీరా నికి ఎన్నో ప్రయోజనాలు సమకూరుస్తుంది. బ్యాక్ వాకింగ్ వల్ల సాధారణ వాకింగ్ చేసిన దాని కంటే అదనపు ఆరోగ్య ప్ర యోజనాలు ఉన్నాయి. బ్యాక్ వాకింగ్ అనేది మెదడుకు సవాలు లాంటిదని వైద్యులు సూచిస్తున్నారు. వాకింగ్ సమ యంలో మనం ఇతర ఆలోచనలపై మెదడు ఉంటుందని, కానీ బ్యాక్ వాకింగ్‌తో దృష్టి, చలనం, గ్రహణం వంటి విషయాలను మెదడు గమనిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

ఎలా మొదలుపెట్టాలి..

వెనక్కి నడవడం అనుకున్నంత సులభం కాదు. ముందుగా రోజూ చేసుకునే వ్యాయామంలో బ్యాక్ వాకింగ్‌ను ఓ భాగంగా చేసుకోవాలి. తొలుత ఇంట్లో లేదా ఆవరణలో వెనక్కి నడవడం మొదలు పెట్టాలి. వెనక్కి నడిచేటప్పుడు పూర్తి రక్షణ చూసుకోవాలి. ముఖ్యంగా వెనక్కి నడిచేటప్పుడు శరీరం వంగి పోతుందేమో గమనించాలి. భుజాల మీదగా చూసుకుంటే ఆ విషయం తెలుస్తుంది. కానీ ప్రతిసారి తల వెనక్కి తిప్పకూడదు. ఎందుకంటే తల నరాలు పట్టేసే ప్రమాదం ఉంది. తల, ఛాతి, ఇతర అవయువాలు నిటారుగా ఉండాలి. వెనక్కి అడుగు వేసే సమయంలో బొటనవేలు ముందు నేలకి తాకిన తర్వా త పాదాన్ని తాకించాలి. ప్రతి అడుగు ఇలానే ఉంచాలి. బొటన వేలి నుంచి మడమ వరకు పాదం ఎలా పడుతుం దనేది జాగ్రత్తగా గమనిస్తుండాలి. అప్పుడే రక్త ప్రసరణ సులభతరమై, చెడు రక్తం నిల్వ లేకుండా ఉంటుంది.

బ్యాక్ రన్నింగ్ కూడా...

వెనక్కి నడవడం అలవాటు చేసుకున్న తర్వాత రన్నింగ్ అలవాటు చేసుకోవాలి. వెనక్కి పరిగెత్తడం వల్ల మోకాళ్లు బాగా పని చేసి కండరాల శక్తి పెరుగుతుంది. దీని వల్ల కండరాల పనితీరు మెరుగు పడి, గాయాల నుంచి త్వరగా కోలుకుంటారు. అంతేగాక ఈ మధ్య ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్న మడమ నొప్పులు నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల, కండరాల కదలికలో మార్పు వస్తుంది. వెనక్కి నడవడం వల్ల శరీర భంగిమ(పోశ్చర్) మెరుగు పడుతుంది. బ్యాక్ రన్నింగ్‌లో శరీరంలో లంబార్ స్పైన్‌కి సపోర్టుగా ఉండే కండరాలు వాడకం జరుగుతుంది. దీంతో లోయిర్ వెన్నునొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

చిన్న అడుగులతోనే..

చిన్న అడుగులతోనే బ్యాక్ వాకింగ్ ప్రారంభించా లి. ఎక్కువ సేపు చిన్న అడుగు లు వేస్తే శరీరం ఉత్తేజమవుతుంది. అంతేగాక మోకాళ్ల కింద భాగాల్లో కండరాల బలం పెరిగి కీళ్ల మీద భారం తగ్గుతుంది. వెనక్కి అడుగు వేయడం వల్ల శరీరం స్థిర త్వం, నిలకడ మెరుగు పడుతుంది. దీంతో శరీర సమతుల్యత మెరుగవుతుంది. ము ఖ్యంగా కుర్చొని పనిచేసే ఉద్యోగులకు, దుకాణాలు నిర్వహించే వ్యాపారులకు, పెద్దలకి, మహిళలకు బ్యాక్ వాకింగ్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఆస్టియో ఆర్థరైటిస్ సమస్యల వల్ల మోకాళ్ల నొప్పులతో ఇబ్బంది ప డుతున్న వారికి, చెడు రక్తం ప్రవ హించే వారికి ఈ నడక మేలు చేస్తుంది.

నడక కష్టతరం

బ్యాక్ వాకింగ్ కష్టతరమైన ప్రక్రియ అని నిపుణులు చెబుతున్నారు. ఈ వాకింగ్ సమయంలో దృష్టి, శరీరం కదలికలో వేగం గమనించాలి. చాలామంది ఇతర వ్యాపకాలు గురించి ఆలోచిస్తూ వాకింగ్ చేస్తుంటారు. కొంత మంది సంగీతం వింటూ వాకింగ్ చేస్తుంటారు. దీని వల్ల ప్రయోజనం ఉండదు. వాకింగ్‌ను చిత్త శుద్ధిగా అలవాటు చేసుకున్న వారికే మాత్ర మే బ్యాక్ వాకింగ్ ప్రారంభించాలి. తొలుతే వెనక్కి అడుగుల వేయడం వల్ల మెదడుపై అదనపు భారం పడుతుంది.

- బ్యాక్ వాకింగ్‌తో శరీరంలో కండరాలు క్రియాశీలకంగా పనిచేస్తాయి. ముఖ్యంగా క్రీడా కారులకు, మహిళలకు, వృద్ధులకు ఈ వ్యాయా మం మంచిది. ఎందుకంటే వెనక్కి అడుగువే య డంతో శరీరంలో స్థిరత్వం, నిలకడ ఏర్పడుతుంది. వా కింగ్, బ్యాక్ వాకింగ్‌లతో గుండెకు ప్రయోజనాలు వస్తా యి. యాంత్రిక జీవితంలో ఈ వ్యాయామం మంచిది.

- డాక్టర్ అంజిత్ ఉప్పుటూరి



నిత్యం చేయాలి

చాలామంది వాకింగ్, బ్యాక్ వాకింగ్ తొలుత ప్రారంభించి, అ తర్వాత అలవాటును దూరం చేసు కుంటారు. అలాకాకుండా నిత్యం చేస్తూనే ఉండాలి. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. వెనక్కి అడు గులు వేయడం కష్టమే, కానీ కొన్ని రోజుల తర్వాత సులభమవుతుంది. కాకపోతే బ్యాక్ వాకింగ్ సరైన స్థలం కావాలి. కొన్ని రోజుల తర్వాత బరువులను లాగుతూ వెనక్కి నడవాలి. ఆ తర్వాత నెమ్మదిగా బరువు పెంచి నడవాలి. దీంతో మోకాళ్ల కండరాలు సాగుతాయి. బాగా అలవాటైన తర్వాత వేగం పెంచోచ్చు. ట్రెడ్ మీల్ మీద కూడా బ్యాక్ వాకింగ్ చేయొచ్చు. బ్యాక్ వాకింగ్ చేసేవారు తొలుత 20 మీటర్లు కంటే ఎక్కువ దూరం పెట్టుకోవద్దు. నెమ్మదిగా మొదలు పెట్టి అందులో సులువు దొరికకా వెనక్కి స్పీడ్‌గా నడవొచ్చు.

అధిక బరువుకు చెక్...



బ్యాక్ వాకింగ్‌ను అలవాటు చేసుకుంటే అధిక బరువు సమస్య నుంచి బయట పడ తారు. స్ట్రోక్ లేదా న్యూరలాజికల్ ఇబ్బందుల వల్ల చాలామంది సమతుల్యత తప్పి పడిపోతుంటారు. వెనక్కి నడవడంలో వల్ల ఈ సమస్యను ముందుగానే గుర్తించే అవకాశం కలుగుతుంది. నడక దిశ మార్చడం వల్ల చికిత్సాపరమైన లాభాలు కూడా ఉంటాయి.

పంచాయతీల కోసం పైరవీలు

(ఐదవపేజీ తరువాయి)

కార్యదర్శులు పాత స్థానంలోనే కొనసాగుతున్నారు. గుంటూరు జిల్లా నుంచి పల్నాడుకు బదిలీ అయిన గ్రేడ్-5 కార్యదర్శులు అక్కడికి వెళ్లేందుకు సుముఖంగా లేరు. బదిలీ స్థానం మార్పించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

వారికోసం నిబంధనలకు నీళ్లు...

గ్రామ, వార్డు సచివాలయంలో నియమించిన పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్-5గా సంబోధిస్తున్నారు. గ్రేడ్-5లో ఉన్న కార్యదర్శులు ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీలో పోస్టింగ్‌ను దక్కించుకునేందుకు లాబీయింగ్ మొదలు పెట్టినట్లు విమర్శలున్నాయి. వీరికి అనుగుణంగా డీపీవో కార్యాలయంలోని ఉద్యోగులు అధిక ఆదాయం కలిగిన పంచాయతీలను గ్రేడ్-5లో చూపించినట్లు సమాచారం. ఉదాహరణకు గుంటూరు రూరల్ మండలంలోని ఓబులునాయుడు పాలెం, గొర్లవారిపాలెం ఆదాయ పరంగా పెద్దవి. వాటిని గ్రేడ్-4 అడిషినల్ అని చూపించారు. ఈ వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది.

గ్రేడ్-4 అడిషినల్ అని..

వాస్తవానికి జీవో 84 ప్రకారం 4 గ్రేడ్లు మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 442పై చిలుకు గ్రామ, వార్డు సచివాలయ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ ద్వారా ప్రత్యేక కోడ్‌ను కేటాయించింది. ఆ కోడ్ ఆధారంగానే వారికి జీతాలు పడతాయి. ఒక వేళ గ్రేడ్- 5 కార్యదర్శిని వేరే గ్రేడ్‌లో నియమిస్తే జీతాల చెల్లింపు వ్యవహారం మెలిక పడుతుంది. ఈ నేపథ్యంలోనే అధికారులు గ్రేడ్ల వారీగా నియమంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అయినా పట్టించుకోని కొందరు పెద్ద పంచాయతీలపై కన్నేశారు. వాటికోసం జిల్లా కార్యాలయంలో భారీగా మామూళ్లు ముట్టజెపుతున్నారు. వారికి లబ్ధి చేకూర్చేందుకు గ్రేడ్-4 అడిషినల్‌అని ఉత్తర్వులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. జీవో 394/2010 ప్రకారం వివరాలు పంపమని అడుగుతుండగా ప్రొఫార్మాలో గ్రేడ్-1, 2, 3, 4, 5, గ్రేడ్-4 అడిషినల్ అని పేర్కొన్నారు. అయితే 2010లో గ్రేడ్-5, గ్రేడ్-4 అడిషినల్ కార్యదర్శులు ఎక్కడ ఉన్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. బదిలీల వ్యవహారంలో జరిగిన అవినీతిపై డీపీవో కార్యాలయంలో కొందరు ఉద్యోగులపై పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. సీఎం, డిప్యూటీ సిఎం దృష్టికి కూడా వీరి అవినీతి వ్యవహారం తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది.

చాలామందికి అందని ఉత్తర్వులు

సెప్టెంబరు 23 నుంచి బదిలీలపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా చాలామంది పంచాయతీ కార్యదర్శులు తమకు బదిలీ ఉత్తర్వులు అందలేదని చెబుతున్నారు. డీపీవో కార్యాలయం దగ్గరకు వెళ్లి ఇద్దరు ఉద్యోగులను కలిస్తేనే ఉత్తర్వులు ఇస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రేడ్-5కి చెందిన కొందరు కార్యదర్శులు ప్రజాప్రతినిధులను కూడా పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రేడ్ విషయం చెప్పకుండా సిఫార్సు లేఖలు తీసుకువచ్చి వాటి ఆధారంగా పైరవీలు చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ల బదిలీలు కూడా ఇంకా జరుగుతూనే ఉన్నాయి. నచ్చిన స్థానం కోసం పలువురు భారీ ఎత్తున చేతులు తడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

భూములు దున్నేసుకుంటాం!

అమరావతి అసైన్డ్ రైతుల హెచ్చరికలు

నాట్ ట్యాలీడ్ జాబితాతో మూడేళ్లుగా అందని కౌలు

కౌలు చెల్లించినట్టు సంతకాలు చేయాలని అధికారుల ఒత్తిడి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'రాజధాని కోసం భూములిచ్చిన మాపై సీఐడీ విచారణ చేస్తారా? విచారణ పేరుతో మూడేళ్లుగా కౌలు ఆపేస్తారా? భూములిచ్చిన పదేళ్ల తర్వాత కూడా న్యాయం చేయరా? సమస్య పరిష్కరించకుండా పరిష్కారమైనట్లు సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తారా? ఈ బాధలు మాకొద్దు! మా భూములు మేమే దున్నేసుకుంటాం' అని రాజధాని అమరావతి అసైన్డ్ రైతులు సీఆర్డీఏ అధికారులకు అడ్డం తిరుగుతున్నారు. అసైన్డ్ రైతుల భూములపై గత వైసీపీ ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. విచారణ ప్రక్రియ మొదలవగానే సీఐడీ అధికారులు ఆ భూములను నాట్ ట్యాలిడ్ జాబితాలో పెట్టారు. దీంతో మూడేళ్లుగా కౌలు చెల్లింపులు ఆపేశారు. తాజాగా 1400 మంది రైతులను ట్యాలిడ్ జాబితాలో చేర్చారు. వారికి కౌలు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే మరో 1,650 ఎకరాల భూమి, అందుకు సంబంధించిన రైతులు వివరాలు ఇంకా నాట్ ట్యాలిడ్ జాబితాలోనే ఉన్నాయి. ఫలితంగా వీరికి కౌలు వచ్చే అవకాశం లేకుండా పోయింది. మూడేళ్లుగా కౌలు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయి, అప్పులపాలైన రైతులు.. కూటమి ప్రభుత్వంపైనే ఆశ పెట్టుకున్నాడు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వారి సమస్య మరింత తీవ్రమయింది.

సీఆర్డీఏ అధికారుల ఒత్తిడితో రైతుల సతమతం

కౌలు రాక ఇబ్బందుల్లో ఉన్న రైతుల పట్ల సీఆర్డీఏ అధికారుల తీరు వారిని మరింత మనోవ్యథకు గురి చేస్తోంది. నీరుకొండ, కురగల్లు రైతులు కౌలు కోసం ప్రభుత్వానికి వినతులు పెట్టుకున్నారు. ఆ వినతులతో సమస్య పరిష్కారం కాకపోగా అవే కొత్త సమస్యగా మారాయి. నిర్ణీత సమయంలోపు వినతులను క్లోజ్ చేయాల్సి ఉండడంతో అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. సీఎంవో కార్యాలయం, సీఆర్డీఏ కమిషనరేట్ నుంచి ఒత్తిడి వస్తోందని, సమస్య పరిష్కారం అయినట్లు సంతకాలు చేయాలని అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. సమస్య పరిష్కారం కాకుండా సంతకాలు చేసేది లేదని రైతులు అడ్డం తిరిగారు. నాలుగు రోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతోంది. దీంతో సమస్య పరిష్కరించకుంటే పొలాల్లో వేసిన హద్దురాళ్లు పీకేసి పొలాలు సాగు చేసుకుంటామని రైతులు తెగేసి చెబుతున్నారు.



వచ్చేశాయ్

- పక్షుల కిలకిలరావాలతో అలరారుతున్న ఉప్పలపాడు
- భారీగా తరలి వచ్చిన విదేశీ అతిథులు..
- నిత్యం సందర్శకులతో కిటకిటలాడుతున్న పక్షుల కేంద్రం



ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో పక్షుల కేరింతలు

పెదకాకాని, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పక్షుల కిలకిలరావాలు, విదేశీ పక్షుల విన్యాసాలతో గుంటూరు జిల్లా ఉప్పలపాడు పులకిస్తోంది. గ్రామంలో ఎటు చూసినా పక్షుల విన్యాసాలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి... శీతాకాలం ప్రారంభ సమయంలో విదేశీ పక్షులు ఇక్కడకు వచ్చి గుడ్లు పొదుగుతాయి. ఈ నెలలో అత్యధికంగా ఓపెన్ బిల్డ్ స్టార్క్ అనే పక్షి జాతి ఇక్కడికి వచ్చింది. దక్షిణాఫ్రికా నుండి ఈ పక్షులు ఇక్కడికి వచ్చాయి. ఇవి కాకుండా వైట్ హైవేస్, డాటర్/ స్నేక్ బర్డ్, కొరముంటూ, ఫెలికాన్స్, పెయింటెడ్ స్టార్క్ ఇలా పక్షుల జాతులు వస్తుంటాయి. సంతానోత్పత్తి తర్వాత తిరిగి నవంబర్, డిసెంబర్ నెలలో వాటి స్వస్థలాలకు వెళ్ళిపోతాయి. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని సందర్శించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు వస్తుంటారు. సెలవు దినాలు, శని, ఆదివారం రోజుల్లో సందర్శకుల సందడి ఎక్కువగా ఉంటోంది.

యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కోవాలి

స్థానికంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అధికార యంత్రాంగం సన్నద్ధమవ్వాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీవీస్‌బీవీ స్వామి పేర్కొన్నారు. ఆదిశగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంగళవారం అల్పపీడన ప్రభావంతో జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా జిల్లాలోని పరిస్థితి, లోతట్టు ప్రాంత ప్రజల తరలింపు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, వివిధ సేవలకు అంతరాయం కలగకుండా తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు. ఆయా అంశాలపై స్వామి మాట్లాడుతూ వచ్చే మూడు రోజుల పాటు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగకుండా చూడాలని, ఆస్తి నష్టాన్ని కూడా సాధ్యమైనంత మేరకు నివారించాలన్నారు. ఇటీవల బదిలీలు జరిగినందున మండల స్థాయి అధికారులు కొత్తగా వచ్చారని, ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే సాగుచేసిన పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలు దెబ్బతింటే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతులను అందుకుంటామని మంత్రి పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం హెచ్చరించినందున మత్స్యకారులతో పాటు భృతి కోల్పోయిన వారికి సాయం అందించేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. ప్రధానంగా కాజ్‌వేలపై నీళ్లు ప్రవహిస్తున్నప్పుడు వాటిపై రాకపోకలు సాగించకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడటంతోపాటు నీరు కలుషితం కాకుండా నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.

అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు 700 విద్యుత్ స్తంభాలను అందుబాటులో ఉంచామని, అందుకు అవసరమైన 300మంది కార్మికులను సిద్ధంగా ఉంచామని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులు డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ బేబీరాణి, బాలశంకరరావు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మానాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, గోపీచంద్, పి. శ్రీనివాస ప్రసాద్, జి.వెంకటనాయుడు, సుశీల, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కంట్రోలు రూమును మంత్రి డాక్టర్ స్వామి పరిశీలించారు. విపత్తు నిర్వహణశాఖ డీపీఎం మాధురి ఆధ్వర్యంలో 24గంటల పాటు పనిచేసేలా ఈ కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి స్వామి

అధ్వాన రహదారికి మోక్షం

రూ.2 లక్షల సొంత నిధులతో మరమ్మతులు

ఐదు గ్రామాల ప్రజలకు తీరిన ఇక్కట్లు



గోతులు పూడ్చిన తరువాత రహదారి ఇలా

ముండ్లమూరు, అక్టోబరు 15: అతనిది కంచు సంకల్పం.. ఆ సంకల్పంతో ఓ అడుగు ముందుకు వేశాడు. సొంత నిధులతో నాలుగు కిలోమీటర్ల రహదారిని మరమ్మతులు చేయించి ఐదు గ్రామాల ప్రజల ఇక్కట్లు తీర్చాడు. మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కంచుమాటి శ్రీనివాసరావు వేములబండ నుంచి రమణారెడ్డిపాలెం, ఈదర వెళ్ళే రహదారికి తన సొంత నిధులు రూ2 లక్షలు వెచ్చించి రహదారికి పడిన గోతులు పూడ్పించారు. అలాగే, అధ్వానస్థితికి చేరిన నాలుగు కిలో మీటర్ల రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు సైతం తొలగించారు. తద్వార వేములబండ గ్రామస్థుల కష్టాలు తీర్చటమే కాకుండా ఆ రహదారిపై ప్రయాణించే రమణారెడ్డి, అయోధ్య నగర్, ఈదర, బొప్పూడివారిపాలెం, వేముల గ్రామాల ప్రజల ఇబ్బందులను తొలగించారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఆ రహదారి గోతులమయమైనా ఏమాత్రం పట్టించుకోలేదు. చినుకు పడితే రహదారి మొత్తం చిత్తడిగా మారి ద్విచక్ర వాహనాల చోదకులు సైతం వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో కంచుమాటి శ్రీనివాసరావు రెండు లక్షల రూపాయలు సొంత నిధులు వెచ్చించి టిప్పర్లతో గ్రావెల్ మట్టిని తీసుకువచ్చి రహదారి గుంటలను పూడ్చటమే కాక గ్రావెల్ మట్టిని రోడ్డు అంతా పరిచి చదును చేయించాడు. దీంతో వాహన చోదకుల ఇక్కట్లు తొలగిపోయాయి. దీంతో పలువురు ఆయనను అభినందిస్తున్నారు.

వాన నీటితో విద్యార్థులకు అవస్థలు

విద్యాశాఖ అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

కారంచేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కారంచేడుమండలం దగ్గుబాడు గ్రామంలోని ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలలో కొద్దిపాటి వర్షానికే ప్రాంగణంలో నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కారంచేడు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాల్‌లో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కారంచేడు మండలం దగ్గుబాడులో ఎంపీపీ స్కూల్ పరిస్థితిపై సర్పంచ్, కోఆప్షన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా పెద్ద ఎత్తున పాఠశాల ప్రాంగణంలో నీరు చేరడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఎంపీపీ వాసుబాబు మాట్లాడుతూ వర్షాల కారణంగా కప్పలవాగు, మొండికాలువకు పడ్డ గండ్లు పూడ్చేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం మండల వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. సమావేశంలో ఎంపీడీవో నేతాజీ, ఈవోఆర్డీ రమేష్‌బాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిత, ఎంఈవో సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మంగళవారం మండలంలోని వల్లాపల్లి గ్రామంలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కజొన్నను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున పొలాల్లో చేరే నీటిని బయటకు పంపాలన్నారు. పొగాకు పంటను తగ్గించి పప్పు ధాన్యం సాగు చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు అయిన రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాలలో ఉన్నాయని జాబితాలను తనిఖీ చేసుకొని లోపాలుంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు దద్దాల అంజయ్య, ఏఈవో వంశీ, విపిఏలు ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మేదరమెట్ల : వర్షాల వలన మినుము, పెసరకు ఇనుప ధాతువు వచ్చే అవకాశం ఉందని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పమిడిపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మినుము, పెసరను పరిశీలించారు. లేత మినుము, పెసర పంటలలో వర్షపు నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసోవాలని ఏవో సూచించారు. లీటర్ నీటికి అన్నబేది 5 గ్రాములు, నిమ్మ ఉప్పు 5 గ్రాములు, యూరియా 15 గ్రాములు కలిపి వారంలో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రసంగులపాడు, పమిడిపాడు రైతులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు బలరామిరెడ్డి మృతి

పంగులూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బూదవాడ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈమని బలరామిరెడ్డి (73) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందారు. నాలుగు రోజుల కిందట ద్విచక్ర వాహనంపై ఇంకొల్లు వెళుతూ బైకు అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అతనికి గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. బలరామిరెడ్డి మృతదేహాన్ని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంపని రవిబాబు, టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ గాదె బ్రహ్మారెడ్డి, రాజేష్ సందర్శించి నివాళులర్పించారు.

వైద్యుడి ఇంట్లో చోరీ

ఒంగోలు క్రైం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ వైద్యుడి ఇంట్లో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ. 15లక్షల విలువైన ఆభరణాలు అపహరించుకెళ్ళారు. ఈ సంఘటన స్థానిక కర్నూలురోడ్డులోని సాయినగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. రిమ్స్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న సుబ్బారావు, ఆయన భార్య ఆదివారం ఇంటికి తాళం వేసి బాపట్లకు వెళ్ళి తిరిగివచ్చారు. వారు తమ వెంట బంగారు ఆభరణాలు తీసుకువెళ్లి శుభకార్యంలో పాల్గొన్న తరువాత వాటిని బ్యాగ్‌లో పెట్టుకున్నారు. ఆదివారం రాత్రి తిరిగి ఒంగోలు వచ్చి వారు తమ బ్యాగ్‌లను హాలులోనే ఉంచి బెడ్‌రూంలో పడుకున్నారు. తెల్లవారి లేచి చూసే సరికి బంగారపు ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించ లేదు. దీంతో పోలీసులకు సోమవారం సమాచారం ఇచ్చారు. అదే సమయంలో బాపట్లలో శుభకార్యానికి వెళ్ళిన చోట మరిచిపోయి ఉండవచ్చున భావించి అక్కడా వెతికారు. అయితే మంగళవారం ఉదయం అభరణాలు ఉన్న బ్యాగ్ సుబ్బారావు ఇంటి సమీపంలో కాలువలో కనిపించింది. దీంతో చోరీ జరిగిందని భావించి పోలీసులు సమాచారం ఇచ్చారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

పంగులూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పథకం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. అలవలపాడు, రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్లు, రూ.2.3లక్షల వ్యయంతో గోకులం షెడ్ల నిర్మాణానికి మంగళవారం అధికారులు, స్థానిక నేతలు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీవో సంతోషం, నోడల్ అధికారులు పి.శివయ్య, ఆదినారాయణ, నాయకులు షేక్ మస్తాన్ వలి, కోమటి ప్రసాద్, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, చల్లగుండ్ల కోటేశ్వరరావు, నారాయణస్వామి, ప్రసన్న, కార్యదర్శులు సునీత, లక్ష్మీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



రేణంగివరంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో

బల్లికురవ : చెన్నుపల్లి, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలలో మంగళవారం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు జరిగాయి. అధికారులు గ్రామాలలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లకు భూమి పూజ కార్యక్రమాలు చేపట్టి గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాలలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని సత్వరమే పనులు ప్రారంభించాలని వారు కోరారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో కుసుమకుమారి, ఎంపీపీ శ్రీలక్ష్మీ, ఈవోపీఆర్డీ సుమతి, కార్యదర్శులు మీరావలి, సర్పంచ్‌లు పందిరి అంజిబాబు, దూళిపాళ్ల బుల్లిరామయ్య, టీడీపీ నేతలు ఆళ్ల చంద్రమౌళి, యాగంటి సింగరయ్య, గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకొండలు, బెల్లంకోండ సుబ్బయ్య పాల్గొన్నారు.

కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మహోన్నత వ్యక్తి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో కలాం జయంతి కార్యక్రమాన్ని పాత దర్శి రోడ్డులోని ఎస్టీ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యా ద్వారానే పేదరికం పోతుందని తెలిపారు. అక్కడ ఉన్న ఎస్టీలకు పిఏఎస్ కోటేశ్వరరావు సౌజన్యంతో ఉలెన్ దుప్పట్లు అందజేశారు. అనంతరం అందరికి స్వీట్లు పంపిణి చేశారు. దాత కోటేశ్వరరావును క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, డాక్టర్ యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీరాలటౌన్ : బహుముఖ ప్రజ్ఞాశాలి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం ఆశయాలపై నేటి యువతరానికి అవగాహన ఉండాలని ఏరి యా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి పేర్కొన్నారు. మంగళవారం హాస్పిటల్‌లో కలాం సేవా సమితి ఆధ్వర్యంలో బాలింతలకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. రాష్ట్రపతిగా కలాం అందించిన సేవలను గుర్తుచేశారు. అటువంటి మహనీయుల అడుగుజాడల్లో నడవాలని సుభాషిణి ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు షేక్ సలామ్, సయ్యద్ బాబు, అక్బర్, అన్సారీ, వదూద్, అల్లాభక్ష్, గౌస్, జమీర్ పాల్గొన్నారు.

మార్టూరు : కలాం జయంతిని మంగళవారం మండలంలోని వలపర్ల జడ్‌పీ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొమ్మి మహేష్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సయ్యద్ కరిముల్లా, ఉపాధ్యాయులు ఆర్, శ్రీనివాసరావు, సుభాషణరావు, జంజనం సాయి, షేక్ అక్రమ్ పాల్గొన్నారు.

పాఠశాలలో మెరుగైన విద్యను అందించాలి

బల్లికురవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని చీరాల డిప్యూటీ ఈవో అబ్బరాజు శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండలంలోని చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం రవిసాగర్, ఉపాధ్యాయులు దూళిపాళ్ల శేషగిరి, శివరామకృష్ణయ్య, శ్రీనివాసరావ, బ్రహ్మయ్య ఉన్నారు.

ఏపఆర్ ఐడీలను పూర్తి చేయాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల అన్నింటిలో ముఖ్యంగా 9, 10 తరగతుల విద్యార్థులకు ఏపీ ఏపఆర్ ఐడీని జనరేట్ చేయాలని చీరాల డిప్యూటీ ఈవో అబ్బరాజు శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఏపిఏపఆర్ ఐడీ ప్రాధాన్యతను గుర్తించి బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. శింగరకొండ వద్ద గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు డి. గంగాధరరావు, బి. సుధాకరరావు, గురుకులం ప్రిన్సిపాల్ దుర్గాగాయత్రి పాల్గొన్నారు.

గుండెపోటుతో ముగ్గురు మృతి

మార్టూరు, ఆంధ్రజ్యోతి, అక్టోబరు 15 : గుండెపోటు కారణంగా మార్టూరు గ్రామాని చెందిన ఇద్దరు, యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన ఒకరు మృతి చెందారు. మార్టూరు ముస్లింకాలనీలో నివాసముంటున్న షేక్ మౌలాలి (52) ప్రభుత్వ ఉద్యోగి గుండెపోటు కారణంగా వారం రోజుల నుంచి గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. అతనికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతను బల్లికురవ మండలం కొణిదెన జడ్‌పి హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. నేతాజీ నగర్‌కు చెందిన ముక్తిపాటి వెంకటేశ్వరరావు (40) గుండెపోటుతో మంగళవా రం వేకువజామున ఇంటిలోనే మృతి చెందారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బొబ్బేపల్లి దండుదారి వద్ద పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ధర్మకర్త, ఫొటోగ్రాఫరు మంగళగిరి కమలాచారి (52) గుండెపోటుతో గుంటూరులో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో కమలాచారి కుటుంబం నివసిస్తున్నారు. మంగళవారం ఉదయం మండలంలోని పలువురు ఫొటోగ్రాఫర్లు కమలాచారి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

వ్యాపారమా..రాజకీయమా

» మూడు పార్టీల వ్యక్తులకు లైసెన్స్ మద్యం

» తెరపైకి వచ్చిన పాత సిండికేట్ల పెద్ద తలకాయలు

» ఒకే గొడుగు కిందికి వ్యాపారం.. లేదంటే నష్టపోతాం

చీరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చీరాల రాజకీయం ఎప్పుడూ రసకందాయమే. పలువురు నేతలు ఏపార్టీలో ఎక్కడ ఉంటారో అర్థంకాని పరిస్థితి. అయితే కొన్ని సందర్భాల్లో ఆదాయ వనరులను సమకూర్చుకునేక్రమంలో పైకి శత్రువుల్లా కనిపించే వారు తెర వెనుక వ్యాపార ఒప్పందాలను కుదుర్చుకుంటూ వస్తున్నారు. తాజాగా చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి తాత్కాలిక లైసెన్స్‌లు కూడా అందజేశారు. లైసెన్స్‌లకు సంబంధించి పైకి కనిపిస్తున్నా వారి వెనుక పాత మద్యం సిండికేట్ పెద్ద తలకాయలున్నాయి. గతంలో మద్యం వ్యాపారంలో కీలకపాత్ర పోషించిన ఓ నేతకు తాజాగా అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతల హస్తం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లోనూ, మద్యం వ్యాపారుల అనుయాయుల్లో చర్చ నడుస్తుంది. ఈక్రమంలో వ్యాపారం చేద్దామా లేకపోతే రాజకీయం చేద్దామా అని ముఖ్యనేతలు మల్లాగుల్లాలు పడుతున్నట్లు సమాచారం.

రంగంలోకి పాత తలకాయలు

గతంలో సిండికేట్‌గా వ్యవహరించిన కారంచేడుకు చెందిన ఇద్దరు వ్యక్తులకు వచ్చిన షాపుల లైసెన్స్‌లు ఒక వర్గంగాను, చీరాలకు చెందిన మద్యం వ్యాపారాల్లో దీర్ఘకాలంగా ఉన్న అన్నదమ్ముల్లో అన్న అధికార పార్టీవైపు, తమ్ముడు జాతీయ పార్టీ నాయకుని వైపు వర్గాలుగా విడిపోయారు. వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులకు కొన్ని కీలక షాపులు దక్కాయి. వీరు కారంచేడు మండల సిండికేట్ వ్యాపారి నేతృత్వంలో అడుగులు వేస్తున్నారు.

సిండికేట్ అవుదామా.. బలాబలాలతో ఎవరి వ్యాపారం వారు చేద్దామా

24 షాపుల్లో పాలక ప్రతిపక్షాలకు చెందిన వారికి దామాషాగా పరిశీలిస్తే ఒకటి అటు ఇటుగా సమానంగానే వచ్చాయి. ఈ నేపథ్యంలో లైసెన్స్‌లు పొందినవారిలో కొందరు సిండికేట్ అవుదాం లేకపోతే నష్టపోతామనే వాదన వినిపిస్తుండగా, మరికొందరు వ్యక్తిగత బలాబలాలతో స్వతంత్రంగా నిర్వహిస్తేనే మంచిదనే భావనలో ఉన్నట్లు తెలుస్తుంది.

షాపుల కోసం పోటాపోటీ

అనుమతులు పొందిన విజేతల వెనుక ఉన్న పెద్ద తలకాయలు షాపుల ఏర్పాటుకు సంబంధించి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొందరు కొన్ని షాపులకు అడ్వాన్సులు ఇచ్చి ప్రత్యర్థి షాపుల లైసెన్స్‌లను ఆర్థికంగా దెబ్బతీయాలనే వ్యూహం రచిస్తున్నట్లు ప్రచారం. పందిళ్లపల్లికి చెందిన వ్యక్తి ఇంకొల్లు మండలానికి చెందిన మరోవ్యక్తి చినగంజాం మండలానికి చెందిన అధికార పార్టీ నాయకుడు మధ్యేమార్గంగా వ్యవహరిస్తున్నారు.

లైసెన్స్‌లు కొనేందుకు రాయబేరాలు

ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన విధివిధానాల నేపథ్యంలో వైన్ షాపులకు మాత్రమే లైసెన్స్‌లు ఇచ్చారు. భవిష్యత్‌లో పర్మిట్ రూంలకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. దానిని దృష్టిలో ఉంచుకుని కొందరు అత్యధికంగా మద్యం విక్రయాలు జరిగే షాపులు పొందిన లైసెన్స్‌లకు పెద్ద మొత్తంలో డబ్బులిచ్చి పొందేందుకు రాయబేరాలు ప్రారంభించారు. అందులో రాజకీయ ప్రమేయమున్నట్లు తెలుస్తుంది.

పాఠశాల భవనాలు శిథిలం

» విద్యార్థులు, ఉపాధ్యాయులు ఫుల్

» తరగతి గదులు నిల్

» భయం భయంగానే నిర్వహణ

» మంజూరు చేయాలని మంత్రి రవికుమార్‌కు విజ్ఞప్తి

సంతమాగులూరు(అద్దంకి), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాడు - నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని గత వైసీపీ పాలకులు గొప్పలు చెప్పుకురు. కొన్ని పాఠశాలల దుస్థితి చూస్తే ఆందోళన కలిగించక మానదు. చాలా పాఠశాలలో లక్షల రూపాయలు వెచ్చించి నాడు - నేడు పనులు చేసినా, తీరా పాఠశాలల విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలల లోని 3,4,5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలలలో కలిపారు. దీంతో నాడు-నేడు పథకం కింద నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని పాఠశాలలు విలీనం కాలేదు. దీంతో ఆయా పాఠశాలలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారు. అయితే ఆ పాఠశాలలు నాడు-నేడు కింద అభివృద్ధి చేయలేదు. ఈ కోవలోనే సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు (హిందూ), వెల్లలచెరువు (హిందూ), కొప్పరం (ముస్లిం) యూటీ స్కూల్‌లు మిగిలిపోయాయి. ఈ మూడు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సంఖ్య ఎక్కువగా ఉంది. అదే సమయంలో ఉపాధ్యాయులు కూడా సరిపడా ఉన్నారు. ఉన్న గదులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో కొన్ని సందర్భాలలో చెట్ల కింద చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏల్చూరు (హిందూ) ప్రాథమిక పాఠశాల స్వాతంత్ర్యం రాక పూర్వం బ్రిటీష్ పాలనలో 1942లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న గదులు సుమారు మూడు దశాబ్దాలకు పూర్వం నిర్మించినవి కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు 130 మందికి పైగా ఉండగా, ఉపాధ్యాయులు ఆరుగురు ఉన్నారు. అదే సమయంలో అదే ప్రాంగణంలో అంగన్‌వాడీ కేంద్రం కూడా నిర్వహిస్తున్నారు. వినియోగించుకునేందుకు వీలుగా ఉన్న గదులు రెండు మాత్రమే కాగా, మిగిలిన గదులలో బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఏ సమయంలోనైనా కూలే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల జరిగే సమయంలో జరగరాని ఘోరం జరిగితే పరిస్థితి ఏమిటని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏల్చూరు రావడంతో పాఠశాల దుస్థితిని ఉపాధ్యాయులు వివరించారు. అదే విధంగా వెల్లలచెరువు(హిందూ), కొప్పరం(ముస్లిం) యూపీ పాఠశాల భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయని, ఈ విషయాలను మంత్రి రవికుమార్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు.



శిథిలావస్థలో ఏల్చూరు ప్రాథమిక పాఠశాల



ఇనుప చువ్వలు బయట పడి ఉన్న పిల్లర్‌లు



పెచ్చులు ఊడి బయట పడ్డ స్లాబ్ ఇనుప చువ్వలు



స్లాబ్ నుంచి ఊడిపడుతున్న పెచ్చులు

భారీ వర్షాల వల్ల ఇబ్బందులు రాకుండా చూడాలి

కలెక్టర్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబ రు 15(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వ ర్షాలపై అధికారులు అప్రమత్తం గా ఉండాలని, వర్షపు నీరు నిలు వకుండా కాలువల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశిం చారు. మంగళవారం నగరంలోని పోతురాజుకాలువ, కొప్పోలు రోడ్, జర్నలిస్ట్ కాలనీతో పాటు పలు శివారుకాలనీల్లో కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణం గా ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం మీడి యాతో మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించామన్నారు. జిల్లాలోని ఐదు కోస్తా మండలా లు ఉన్నాయని, వాటి పరిధిలో 53 హాబిటేషన్ సెంటర్లు ఉన్నట్లు తెలిపారు. పది హేను పునరావాస కేంద్రాలను గుర్తించగా ఇందులో ఐదు కేంద్రాలు ఇప్పటికే అం దుబాటులోకి తీసుకువచ్చి సోమవారం నుంచి ఆ ప్రాంత ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూ రు, జరుగుమల్లి, కొండపి మండలాల్లో 75 మి.మీ వర్షం పడిందని, వాగులు, కల్వ ర్టులలో నీరు వెళ్ళేందుకు ఎలాంటి ఆటంకం ఉండకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాగులు, వంకల్లో, సైడుకాలువల్లో పేరుకుపోయిన చెత్తను, పూడిక తీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీఆర్వోలు, వార్డు ఎమెనిటీ, శానిటేషన్ సెక్రటరీలను నియమించి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ముంద స్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్నీ శాఖల అధికారులను సమన్వయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

వాగులు ఉధృతం



కడవకుదురు ప్రాంతంలో వరద నీటిలో ఉన్న నారుమడి



నీలాయపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నాగన్నవాగు

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు
- వరదకు తోడు సాగర్ కాలువల నీరు

అద్దంకి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని నల్లవాగు, దోర్నపు వాగులు ప్రవహిస్తున్నాయి. వరద నీటికి తోడు సాగర్ కాలువల నీరు కూడా వాగులకు చేరుతుండడంతో ప్రవాహ జోరు పెరిగింది. గుండ్లకమ్మ నది ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఆ నీటి ప్రవాహం ఇంకా అద్దంకి సమీపానికి రాక పోవడంతో గుండ్లకమ్మ నది ఓ మోస్తరుగా ప్రవహిస్తోంది. భవనాసి చెరువు కూడా పూర్తి స్థాయిలో నిండింది. పేరాయపాలెం వద్ద దోర్నపు వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం, ఇప్పటికే ప్రత్యామ్నాయ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో వాహనాల రాకపోకలకు ఒకింత ఇబ్బందిగా మారింది.

డ్రైన్ పగిలి ఇళ్లల్లోకి చేరిన వరద

చీరాలటౌన్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్ష బీభత్సానికి చీరాల పురపాలక సంఘం పరిధిలో ప్రజల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. మరో వైపు పాపరాజు తోటలో డ్రైనేజీలు నిండి పగిలిపోయాయి. దీంతో మురుగు నీరు ఇళ్లల్లోకి చేరాయి. దీంతో ఆ ప్రాంత వాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. కంపును భరించ లేకపోయారు. చేసేది లేక మురుగును ఎత్తిపోసుకున్నారు. వెంటనే చర్యలు చేప ట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

సాగు ఆరంభంలోనే వర్షార్పణం

చినగంజాం : రబీ సాగుకు సన్నద్ధమైన అన్నదాతలకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఎకరానికి సుమారు రెండున్నర వెయ్యి రూపాయలు ఖర్చు చేసి పోసిన నారుమళ్లు భారీ వర్షానికి నీట మునిగాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చినగంజాం, నీలాయపాలెం, కడవకుదురు, చింతగుంపల్లి, పెదగంజాం ప్రాంతాల్లోని పొలాలన్నీ జలమయమయ్యాయి. మండలంలోని కడవకుదురు ప్రాంతంలోని పాతపాడు, వాద పొలాలకు సంబంధించి నాలుగు వందల ఎకరాలలో పోసిన నారుమడులు, చినగంజాం ప్రాంతంలోని ధనలక్ష్మీ లిఫ్ట్ ఇరిగేషన్ సొసైటీ కింద 300 ఎకరాలకు పోసిన నారుమడులు, హనుమాన్ లిఫ్ట్ ఇరిగేషన్ ఆఫ్ సొసైటీ కింద 100 ఎకరాలకు పోసిన నారుమళ్లలో గత మూడు రోజులుగా వర్షపు నీరు నిల్వ ఉండడంతో విత్తనాలు మొలకెత్తిన నారు పనికి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నారుమళ్లు పోసుకోవాలని వాపోతున్నారు. అధికారులు గుర్తించి ఉచితంగా వరి విత్తనాలు అందించాలని కోరుతున్నారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు పరిధిలో పోసిన నారుమడులు రెండు రోజులుగా వరదనీటిలో ఉన్నాయిని రైతులు తెలిపారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం ప్రాంతంలో 100 ఎకరాలలో వేసిన వరినాట్లు, 25 ఎకరాలలో వేసిన వేరుశనగ, ఆరు ఎకరాలలో వేసిన చిలకడదుంప పంటలు నీట మునిగినాయని రైతులు తెలిపారు. ఎంతో శ్రమ కూర్చి రూ.60వేల పెట్టుబడులు పెట్టి పండించిన పంట ఇంటికి వచ్చే సమయంలో వర్షం ముంచెత్తడంతో వేరుశనగ పంటలో వర్షపు నీరు చేరి కాయలు కుళ్లిపోయాయని కౌలు రైతులు



పోలూరి వాగును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ రత్నకుమారి

అవనిగడ్డ నాగరాజు, చాపల అంకయ్య, పెదశింగు దస్తగిరి, పిట్టు పాండు రంగారెడ్డి, కాటం నాగుర్, దండుప్రోలు యనాది ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు. పల్లెపాలెంలో లోతట్టుప్రాంతంలో నివసిస్తున్న వల్లభుని శేషయ్య, పీతా శ్రీనుతో పాటు మరో 18మంది ఇళ్లలో వర్షపు నీరు చేరింది. ఈ విషయాన్ని సర్పంచ్ నక్కల కృష్ణ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ శీలం రమేష్ గ్రామంలో తుఫాన్ షెల్టర్‌లో వారికి పునరావాసం కల్పించారు. గ్రామాన్ని వరదనీరు ముంచెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకున్నారు. ఎక్స్‌కవేటర్ ద్వారా చెరువుకి గండి కొట్టి చెరువు నుండి నీరు సముద్రానికి వెళ్లేట్లు ఏర్పాటు చేశారు.

నీలాయపాలెం గ్రామాన్ని చుట్టుముట్టిన వరదనీరు

మండలంలోని నీలాయపాలెం గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టింది. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు చేరింది. నీలాయపాలెం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్యగల నాగన్నవాగుకు భారీగా వరదనీరు చేరింది. కొత్తకాలువకు పలు చోట్ల గండ్లు పడి గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ఇతర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ వరకు ఐదు అడుగుల మేర వరదనీరు ప్రవహిస్తుందని తెలిపారు. 400 ఎకరాలలో వేసిన వరిపైరు నీటమునిగిందని రైతులు చెప్పారు. వైసీపీ హయాంలో నాగన్న వాగులో పూడిక తీయకపోవడంతో వాగులో తూటికాడ, చిల్ల చెట్లు బాగా పెరిగిపోవడంతో వరదనీరు సక్రమముగా పోయే మార్గం లేక ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామానికి రాకపోకలు లేవన్నారు. నాగన్న వాగు ఉధృతిని పరిశీలించిన అధికారులు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలం పోలూరు గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. సోమవారం రాత్రికి పోలూరు వాగు (పర్చూరు వాగు) వంతెన పై నుంచి నీరు ప్రవహించడంతో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ డీ రత్నకుమారి వాగు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. యద్దనపూడి - చిలుకూరివారిపాలెం వంతెనపై కూడా నీరు రావడంతో రాకపోకలు నిలిపోయాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు డేగరమూడి, రాజుగారిపాలెం వాగుల వద్ద పర్యవేక్షిస్తున్నారు.



వీరన్నపాలెం ప్రాంతంలో నీట మునిగిన పంట పొలాలు

ఇంకొల్లు : వర్షాలకు పాతమద్రాసు రోడ్డులోని దుద్దుకూరు వద్ద వాగు పొంగిప్రవహిస్తోంది. మంగళవారం రాకపోకలు నిలిచిపోయాయి. నేలచప్టాపై వరద ప్రవాహం ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పర్చూరు : ఎడతెరపి లేకుండా కురుస్తున్న బారీ వర్షాలతో పంట పొలాలు నీట మునిగాయి. శివారు కాలనీలు జలమయమయ్యాయి. రహదారులపై పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పర్చూరులోని నెహ్రూ నగర్, అంబేడ్కర్‌నగర్, ఇందిరా కాలనీ, పర్చూరు, ఉప్పుటూరు కాలనీలను నీరు చుట్టుముట్టింది.



దుద్దుకూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



పేరాయపాలెం సమీపంలో ప్రవహిస్తున్న దోర్నపు వాగు



చీరాలలో ఇళ్లల్లోకి చేరిన మురుగు నీరు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులు 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మినుము, మొక్కజొన్న, పొగాకు పంటలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఉద్యాన అధికారి ఎస్.దీప్తి మాట్లాడుతు రాయితీపై తైవాన్ స్ప్రేయర్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొనిగల శాంతమ్మ, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ సీత, పశు సంవర్ధక శాఖ సహాయకులు కిరణ్, రైతులు పాల్గొన్నారు.

18న ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

అద్దంకిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల అద్దంకి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగుతుందని సంస్థ జిల్లా అధికారి ప్రణయ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలలో టాటా క్యాపిటల్, జోయాలుక్కాస్, హెటిరో లాబ్స్ ప్రైవేటు లిమిటెడ్, అరబిందో ఫార్మసి కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. 150కి పైగా ఖాళీలు ఉన్నాయని విద్యా అ ర్హతను బట్టి సుమారు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఎంబీఏ, పీజీ విభాగాలకు చెందిన 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్ ఆధార్, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9440635677 సంప్రదించాలని తెలిపారు.

పారదర్శకంగా విచారిస్తాం : డీఎస్పీ

చీరాలటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పులి శ్రీనివాసరావు మృతిపై పారదర్శకంగా విచారణ చేపడతామని, కచ్చితంగా న్యాయం చేస్తామని డీఎస్పీ జగదీష్ నాయక్ పేర్కొన్నారు. దసరా పండుగ రోజు రాత్రి అనుమానాస్పదంగా శ్రీను మృతిచెందిన విషయమై గ్రామస్థులు, కుటుంబ సభ్యులు మంగళవారం ఘటనా స్థలం వద్ద ఆందోళనకు దిగారు. డీఎస్పీ అక్కడకు వెళ్లి బాధిత కుటుంబం, గ్రామస్థులతో మాట్లాడారు. ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. దీనిలో ఎవరి పాత్ర ఉన్నా వదిలేది లేదన్నారు. మీకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సీఐ శేషగిరిరావు, ఎస్ఐ శివకుమార్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

మందుకు డబ్బులివ్వలేదని పారతో దాడి

చీరాలటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని స్నేహితుడిపై పారతో దాడి చేసిన సంఘటన మంగళవారం కొత్తపేట మూడు రోడ్ల సెంటర్ సమీపంలో చోటుచేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన కటకం శివరామప్రసాద్ ఎద్దుల బండి నడుపుతుంటాడు. ఇతనికి చీరాల గొల్లపాలెంకు చెందిన చుక్కా వెంకటేష్ మిత్రుడు. మూడురోడ్ల సెంటర్‌లోని కార్ఖానా సమీపంలో కూర్చొని ఉన్న శివరామ ప్రసాద్ వద్దకు వెంకటేష్ వచ్చి తాగేందుకు డబ్బులు అడిగాడు. అందుకు నిరాకరించడంతో పక్కనే ఉన్న పారతో శివరామ ప్రసాద్ ముఖంపై దాడి చేశాడు. స్థానికులు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు అవుట్‌పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

లక్కీ డిప్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో దేవస్థానం కమిటీ సభ్యులు

అద్దంకి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : కన్యకాపరమేశ్వరి దేవస్థానం 53వ శరన్నవరాత్రుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం లక్కీ డీప్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహించిన లక్కీడిప్‌లో ప్రథమ బహుమతి పొందిన కురిచేటి దినేష్‌కు గోల్డ్ కాయిన్, 53కిలోల లడ్డు, ద్వితీయ బహుమతి పొం దిన అరవపల్లి సురేంద్రబాబుకు 18కిలోల లడ్డు, గోల్డ్ కాయిన్, తృతీయ బహుమతి పొందిన పూటుకూరు పూర్ణచంద్ర రావుకు గోల్డ్‌కాయిన్ ను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఊటుకూరు రామకోటేశ్వరరావు, కా ర్యనిర్వహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు,అరవపల్లి హనుమంతరావు, భోజనపల్లి సత్యనారాయణ, చిన్ని వీరయ్య, గోపు శ్రీనివాసరావు, పిఎయస్ కోటేశ్వరరావు, సుబ్బరాయుడు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

బైకు చోరీకి పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు

బల్లికురవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మోటార్ బైకుల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని మంగళవారం బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి అరెస్టు చేసి, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొత్తూరుకు చెందిన తన్నీరు నరసంహారావు, బొల్లాపల్లికి చెందిన గోగు నరసింహారావు పల్నాడు జిల్లా వినుకొండలో రెండు బైకులు చోరీ చేసి వస్తుండగా కొప్పెరపాడు వద్ద ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు. వారిని అద్దంకి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులపై నర్సారావుపేట, శావల్యాపురం, అద్దంకి, పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు తెలిపారు.

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

స్వర్ణ (పర్చూరు) 15 (ఆంధ్రజ్యోతి) : నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని కారంచేడుమండలం స్వర్ణ గ్రామస్తులు కొందరు చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మద్యం దుకాణం దక్కించుకొన్న ప్రైవేట్ వ్యక్తులు నివాసాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా హాస్పిటల్‌లోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి అంతర్గత రోడ్లు, గేట్లు, సిబ్బంది కొరత, కొన్ని పరికరాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కమిటీ ప్రతినిధులతో చర్చించారు. సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వివరించారు. హాస్పిటల్‌కు వైద్యం కోసం వచ్చేవారికి మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే సూచించారు. అంతకముందు ఆయన వార్డులను పరిశీలించారు. మార్చురీ బాక్సుల నిమిత్తం రూ.35వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బండారుపల్లి హేమంత్‌కుమార్, వలివేటి మురళీకృష్ణ, డా.హరిబాబు, డా.కోటి నాగిరెడ్డి, డా.షణ్ముఖ, టీడీపీ నాయకురాలు సజ్జా హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

కమిషనర్‌కు ఫిర్యాదు



ప్రభుత్వ స్థలంలో గదుల ఏర్పాటుకు తోలిన రాళ్లు

అద్దంకి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నిస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. పట్టణంలోని పసుమర్తిపాలెం, బోడెంపూడివారిపాలెం మధ్య రోడ్డు వెంబడి ప్రభుత్వ స్థలం ఉంది. అయితే ఆ స్థలాన్ని ఇప్పటికే కొంత మంది ఆక్రమించుకొని ఎరువు దిబ్బలు వేశారని, ప్రస్తుతం మరో అడుగువేసి ఆ ప్రాంతంలో ఉన్న వేప చెట్టును తొలగించారని, గదులు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ రవీంద్రకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు నంబూరి వసంతకుమారి తెలిపారు.

కొరిశపాడు ఎత్తిపోతలను పూర్తి చేస్తాం

- మంత్రి రవికుమార్
- పలు సమస్యలపై సానుకూల స్పందన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తి చేయిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా కొరిశపాడు మండలం పమిడిపాడులో జరిగిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జీ, ఆర్డీవో అఖిల తదితర అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.40లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీకి రావాల్సిన నిధులను అందజేయడంతో వాటి అభివృద్ధి, బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. కొరిశపాడు మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి రూ.11కోట్ల80లక్షల విలువైన పనులు మంజూరైనట్లు తెలిపారు. పమిడిపాడు ఎస్సీ కాలనీలోని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. 20వేల ఎకరాలకు నీరు అందించే కొరిశపాడు ఎత్తిపోతలను వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. సుబ్బారెడ్డి తండ్రి పేరుతో ఉన్న ఎత్తిపోతలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రిజర్వాయర్ నుం చి బొల్లవరప్పాడు రిజర్వాయర్ వరకు నిర్మించాల్సిన ఫీడర్ కాలువకు 99ఎకరాల భూమి అవసరం కాగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఎకరానికి రూ.12లక్షల పరిహారాన్ని తాను ఇప్పించినట్లు జేసీకి తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో గ్రామీణ రోడ్లను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు రాగానే రహదారుల బాగుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అద్దంకి నుంచి సముద్రతీరం వరకూ బస్సు నడపాలని గ్రామస్థు లు కోరగా స్పందించారు. గతంలో నడిచిన పోతవరం నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని కోరారు. గుండ్లకమ్మ ఎడమ కాలువ నుంచి కనగాలవారిపాలెం చెరువు నింపుకోవడానికి పైపులైన్ నిర్మాణం చేయాలని కోరారు. నూజిళ్లపల్లి చెరువు నుంచి తమ గ్రామానికి వచ్చే తాగునీటి పైపులైను ధ్వంసమైందని కొత్త పైపులైన్లు వేయాలని గ్రామస్థులు మంత్రికి తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పమిడిపాడు ఎస్సీ కాలనీలో మంత్రి గొట్టిపాటి పర్యటించారు. సామాజిక భవనం నిర్మించాలని, రోడ్లకు మురుగు కాలువలు లేవని ఎస్సీ కాలనీవాసులు మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ సామాజిక భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, హౌసింగ్ ఏఈ నటరాజ్ గ్రామ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెనీ అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్ : చీరాల నియోజకవర్గ పరిధిలోని ప్రతిపల్లెనూ అభివృద్ధి చేస్తామని ఎ మ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమం మంగళవారం వేటపా లెం మండలంలోని కొత్తపేట, చల్లారెడ్డిపా లెంలో నిర్వహించారు. కొత్తపేటలో రూ.17.2 లక్షల సీసీ రోడ్లు, చల్లారెడ్డి పాలెంలో రూ.30.55లక్షలతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ పల్లెల అభివృద్ధికి కూట మి ప్రభు త్వం శ్రీకారం చు ట్టిందన్నారు. గ్రామ సభలల్లో ఆమోదించిన 30వేల పనులు ప్రారంభమవడం సంతోషదాయకమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవన్నారు. విధ్వంస పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్‌బాబు, స్పెషల్ ఆఫీసర్ శేషయ్య. ఏపీవో దాసు, సచివాలయ, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

4 ఊళ్లలో రూ.50లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన

అద్దంకిటౌన్ : గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేయడమే పల్లె పండగ లక్ష్యమని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు, వెంపరాల, చక్రాయపాలెంలో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఉప్పలపాడు గ్రామం లో రూ.10లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణాలకు భూమిపూజ, వెంపరాల గ్రా మంలో మూడు ప్రాంతాలలో రూ.30లక్షలుతో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమి పూజలు, చక్రాయపాలెంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వీఎస్‌హెచ్‌వీఎం ప్రసాదరావు, ఏపీవో గాయత్రి, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఈసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పల్లా నాగేశ్వరరావు, బాజీబేగం, పి.శ్రీనివాసరావు, టీఏలు మురళి మనోహర్, కొండయ్య, నాగేశ్వరరావు, శ్రీను, సచివాలయ సిబ్బంది, గ్రామ టీడీపీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

యద్దనపూడి : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.25లక్షలతో 4 సీసీ రోడ్లకు, 3 గోకులం షెడ్లకు శంకుస్థాపన చేశారు. సూరవరపుపల్లిలో 2 గోకులం షెడ్లకు, లక్కవరంలో రూ.10లక్షలతో, రాజుగారిపాలెంలో రూ.15 లక్షలతో పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

వేమవరం ఎస్టీ కాలనీలో దుర్గామాత పూజల్లో పాల్గొన్న మంత్రి

బల్లికురవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అకాంక్షించారు. మంగళవారం మండలంలోని వేమవరం ఎస్టీ కాలనీలో దసరా నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద మంత్రి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి రవికుమార్‌కు ఎస్టీ కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. రవికుమార్ మాట్లాడుతూ దైవ పూజల్లో ఉన్నవారంతా శాంతిమార్గంలో ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.